ప్రజాశక్తి

మంగళవారం 29 అక్టోబర్ 2024 8 పేజీలు





ఇసుక మాఫియా బరితెగింపు!

- యథేచ్ఛగా తవ్వకాలు, రవాణా
- టిడిపి ప్రజాప్రతినిధులే పాత్రదారులు
- రంగంలోకి టాస్క్‌ఫోర్స్

ప్రజాశక్తి - కంచికచర్ల, నందిగామ : ఇసుక మాఫియా బరితెగిస్తోంది. రోజురోజుకూ ఈ మాఫియా ఆగడాలు పెరిగిపోతున్నాయి. రాష్ట్రస్థాయిలోనే అక్రమ ఇసుక రవాణా గురించి చర్చించుకునేంతగా నందిగామ నియోజకవర్గంలో మాఫియా రెచ్చిపోతోంది. కంచికచర్ల మండలం కీసర, గండేపల్లి, పెండ్యాల, వేములపల్లి, నందిగామ మండలం కంచల పరిధిలో రాత్రి పూట మునేరులో జెసిబిలతో ఇసుక తవ్వకాలు జరిపి లారీల్లో విజయవాడ, హైదరాబాద్ తరలిస్తున్న విషయం తెలిసిందే. అలాగే కంచికచర్ల మండలం మోగులూరు పరిధిలో కష్ణానది నుండి, కీసర, మోగులూరులో ఇసుక స్టాక్ పాయింట్ల నుండి యధేచ్ఛగా ఇసుక దోపిడీ జరుగుతూనే ఉంది. విజయవాడ పార్లమెంటు పరిధిలో అధికార పార్టీ ప్రజాప్రతినిధి, అలాగే నందిగామ నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకుని కనుసన్నల్లో ఇసుక దోపిడీ జరుగుతోందని నియోజకవర్గవ్యాప్తంగా కోడై కూస్తోంది. గత ఎన్నికలకు ముందు ఏడాదిగా, ఆ తర్వాత సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వచ్చేనాటికి సూమారు రూ.200 కోట్లు ఖర్చు చేశామని, అవి పూడ్చుకోవాలంటే ఇలాంటి పనులు చేయకతప్పదని అధికార పార్టీ ప్రజాప్రతినిధి అనుచరులు అంటున్నారని టిడిపి కార్యకర్తలే చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో కంచికచర్ల, నందిగామల్లో రూ.50 కోట్ల విలువైన ఇసుక దోపిడీకి గురైందని తెలిసింది. గత ప్రభుత్వ హయాంలో డంపింగ్ కేంద్రాల వద్ద నిల్వ చేసిన లక్షలాది క్యూబిక్ మీటర్ల ఇసుకను ఉచితం పేరుతో అధికార కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధుల ముసుగులో లూఠీ చేసి కోట్లు దండుకున్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఇసుకనే లూఠీ చేశారంటే అధికారం ముసుగులో ఇసుక మాఫియా ఎంత ప్రభావం చూపుతుందో అర్ధమౌతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లూఠీ జరిగిన ఇసుకకు లెక్కలు లేకపోగా, ప్రస్తుతం ఉచితం పేరుతో అంతకు మించి దందా జరుగుతోంది. ఇసుక అక్రమ రవాణాలో ఎంతటి వారున్నా ఉపేక్షించేదిలేదని సాక్షాత్తూ ముఖ్యమంత్రి హెచ్చరికలు చేస్తున్నా క్షేత్ర స్థాయిలో ఆ పార్టీ నాయకులు, కొందరు ప్రజాప్రతినిధులు అవేమీ పట్టించుకోకుండా యథేచ్ఛగా దందా కొనసాగిస్తున్నారని (మిగతా 2లో)

ఇసుక డంప్ సీజ్

కంచికచర్ల మండలం గండేపల్లిలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌ను రెవెన్యూ, పోలీసు సిబ్బంది సోమవారం తెల్లవారుజామున సీజ్ చేశారు. మండలంలోని కీసర గ్రామానికి చెందిన మీసాల రాము మునేటి నుండి సుమారు15 ట్రాక్టర్ల ఇసుక (60 టన్నులు) గండేపల్లిలో ఖాళీ ప్రదేశంలో నిల్వ చేశాడు. దీనిని లారీల్లో తరలించి విజయవాడ. చుట్టుపక్కల ప్రాంతాల్లో అమ్ముకునేందుకు సిద్ధపడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. విషయం తెలుసుకున్న రెవెన్యూ, పోలీస్ సిబ్బంది గుర్తించి సీజ్ చేశారు. ఇసుకను నిల్వ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బోనగిరి రాజు తెలిపారు.



కంచికచర్ల మండలం గండేపల్లి వద్ద ఇసుక డంప్ సీజ్ చేసిన పోలీసులు

టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు

ఇసుక దందాను అరికట్టేందుకు ప్రభుత్వమే టాస్క్‌ఫోర్స్ టీమ్‌లను ఏర్పాటు చేసింది. ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ రాజశేఖర్ బాబు ఆధ్వర్యంలో నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా గుర్తించేంధుకు సాంకేతిక పరిజ్ఞానంతో డ్రోన్లు ఉపయోగిస్తూ ఇసుక అక్రమ నిల్వలు, అక్రమ లోడింగ్ గుర్తించి సంబంధిత ఏరియాలో రెవెన్యూ, పోలీస్, మైనింగ్ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. దీంతో రెండు రోజులుగా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తనిఖీలు చేస్తున్నారు. అయినా అక్కడక్కడా ఇసుక లూఠీ జరుగుతూనే ఉంది.

నందిగామ ప్రాంతంలో ఇసుక తవ్వకాలను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు





ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు

- సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు
- కంకిపాడు - గుడివాడ రోడ్డు బాగుచేయాలని పాదయాత్ర

ప్రజాశక్తి - కంకిపాడు, గుడివాడ : కంకిపాడు - గుడివాడ రహదారిని బాగు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిపిఎం ఆధ్వర్యాన పాదయాత్ర నిర్వహించారు. కృష్ణాజిల్లా కంకిపాడు మండలం కోమటికుంట నుంచి మానికొండ మీదుగా గుడివాడ వరకు సుమారు 25 కిలో మీటర్ల మేర ఈ యాత్ర సాగింది. ఈ కార్యక్రమాన్ని సిపిఎం సీనియర్ నాయకులు వేమూరి నాగేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ నాలుగు నియోజకవర్గాలను కలిపే ప్రధాన రహదారిగా ఉన్న ఈ రహదారి దశాబ్దాల కాలంగా అభివద్ధి నోచుకోలేదన్నారు. దీంతో ఎన్నో ప్రమాదాలకు కారణమవుతోం దన్నారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. ఏ ప్రభుత్వం వచ్చినా, ఏ పార్టీ ఎంఎల్ఎ గెలిచినా ఈ రహదారిని అభివృద్ధి చేయడంలేదన్నారు. కనీసం మరమ్మతులు కూడా చేపట్టడంలేదని విమర్శించారు. విజయవాడ నుండి పశ్చిమగోదావరి జిల్లా భీమవరం వెళ్లడానికి కూడా ఇదే ప్రధాన రహదారి అని పేర్కొన్నారు. ప్రతి రోజూ వేలాదిమంది ఈ దారిలోనే ప్రయాణిస్తుం టారని చెప్పారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో గమ్యం చేరేవరకు ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రతి రోజూ ఏదో ఒక చోట ఈ రోడ్డుపై ప్రమాదాలు జరగడం, పలువురు తీవ్రంగా గాయపడడం లేదా ప్రాణాలు కోల్పోవడం సర్వసాధారణంగా మారిందన్నారు. వాహనాలు అదుపుతప్పి పక్కనే ఉన్న కాల్వలోకి దూసుకెళ్లిన సంఘటనలు కూడా ఉన్నాయన్నారు. ఈ మార్గానికి ఆనుకుని వెళు తున్న కాల్వకు రిటైనింగ్ వాల్ నిర్మించి రహదారిని అభివద్ధి చేయాలని నరసింహారావు డిమాండ్ చేశారు. అనంతరం గుడివాడ ఆర్‌డిఓ సుబ్రహ్మణ్యం, ఆర్అండ్‌బి డిఇఇ కె.శ్రీనివాస్‌కు సిపిఎం నేతలు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.శివనాగేంద్రం, టివి.లక్ష్మణస్వామి, జిల్లా కమిటీ సభ్యులు పంచకర్ల రంగారావు, కంకిపాడు, ఉంగుటూరు, ఉయ్యూరు, పెదపారుపూడి మండలాల కార్యదర్శులు టి నరేష్, ఏ వెంకటేశ్వరరావు, బి రాజేష్, ఒ.గంగాధర్, గుడివాడ పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి, కంకిపాడు మండల నాయకులు జె.రవి, వి.జాన్ మోజెస్, సిహెచ్.శ్రీహరి, వి.శివ శంకర్, పార్టీ నాయకులు కె.నాంచారయ్య, యేసు, సుందరం, బెనర్జీ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం, మహిళా నాయకులు పి.రజిని, కీర్తి, వీరమ్మ, అరుణా, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, నాయకులు బివి శ్రీనివాస్, రేపాని కొండ పాల్గొన్నారు.

కోర్టు వద్ద ఉద్రిక్తత

- ఓ కేసులో విచారణకు వచ్చిన మాజీ ఎంఎల్ఎ వంశీ
- భారీగా టిడిపి, వైసిపి శ్రేణుల మోహరింపు
- ఇరువైపుల వారిని అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలోని ప్రజాప్రతినిధుల కోర్టు వద్ద సోమవారం స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. ప్రజాప్రతినిధుల కోర్టుకు గన్నవరం మాజీ ఎంఎల్ఎ వల్లభనేని వంశీమోహన్ హాజరయ్యారు. ఇదే కేసులో ప్రసాదంపాడు సర్పంచ్, ప్రస్తుతం టిడిపిలో ఉన్న కూరపాటి నరసయ్య కూడా నిందితుడిగా ఉన్నారు. 2019 ఎన్నికల్లో గన్నవరం నుంచి టిడిపి తరుపున పోటీ చేసిన వల్లభనేని వంశీ ఎన్నికల్లో రిగ్గింగ్ జరుగుతోందంటూ జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈ వ్యవహారంలో ఆనాడు వైసిపిలో ఉన్న నరసయ్యపై పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఏడాది జరిగిన ఎన్నికల సమయంలో రాజకీయ మార్పుల నేపథ్యంలో వంశీ వైసిపిలో ఉండగా, నరసయ్య టిడిపిలో ఉన్నారు. ఎన్నికలకు ముందు విజయవాడ కోర్టు ప్రాంగణంలో వంశీ, నరసయ్య అనుచరుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తాజాగా సోమవారం ఈ కేసు విచారణ నిమిత్తం కోరుకు వచ్చిన వంశీ వెంట వైసిపి కార్యకర్తలు, నరసయ్య వెంట టిడిపి కార్యకర్తలు భారీగా తరలి వచ్చారు. దీంతో కోర్టు వద్ద ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ముందస్తుగానే భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. వంశీ, నరసయ్యలను కోర్టు హాలులోకి అనుమతించిన పోలీసులు... ఇరు పార్టీల కార్యకర్తలను కోర్టు బయటే అడ్డుకొని వెనక్కి పంపారు. ఘర్షణలు తలెత్తకుండా ఇరువైపుల వారిని చెదరగొట్టారు. ఓ దశలో బాహాబాహీకి దిగుతారేమోనని పోలీసులు తీవ్ర ఆందోళన చెందారు. ఎట్టకేలకు ఇరుపార్టీల వారు సద్దుమణగడంతో వారు ఊపిరిపీల్చుకున్నారు.

ప్రైస్ అవార్డుకు విఎంసి ఎంపిక

నేడు ప్రదానం

ప్రజాశక్తి - విజయవాడ : మున్సిపల్ శాఖ మంత్రి చేతుల మీదుగా విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అవార్డు అందుకోనున్నారు. మెప్మా ఆధ్వర్యంలో జరగనున్న ప్రైస్ అవార్డు 2023-2024ను ఈనెల 29వ తేదీన విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ చేతుల మీదుగా విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర అందుకొనున్నారు. కేంద్ర ప్రభుత్వం వారి డివై-ఎన్‌యుఎల్ఎం (దీన్ దయాల్ అంటోద్యయ యోజన - నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్ మిషన్)లో భాగంగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ పర్ఫామెర్గా ఎంపికై ప్రైస్ (పర్ఫామెన్స్ రికగ్నిషన్ ఫర్ యాక్సిస్ టు ఫైనాన్షియల్ ఇంక్లూషన్ అండ్ స్ట్రీట్ వెండార్స్ ఎంపవర్మెంట్) అవార్డు అందుకుంటారు. నేషనల్ అర్బన్ లవ్లీ హుడ్ మిషన్‌లో భాగంగా వీధి విక్రయదారులకు ఎక్కువ శాతంలో రుణాలు కల్పించి, వారి ఆర్థిక స్థితిగతులను ప్రోత్సహిస్తున్నందుకు విజయవాడ నగర పాలక సంస్థ, మెగా అండ్ మిలియన్ ప్లస్ సిటీస్ క్యాటగిరీలో బెస్ట్ పెర్ఫార్మర్‌గా ప్రైస్ అవార్డు 2023-2024నకు ఎంపికైంది.

నేడు ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ

ప్రజాశక్తి - విజయవాడ : మానవ హక్కుల ఉద్యమ నేత, ప్రఖ్యాత స్కాలర్ ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబా సంస్మరణ సభ మంగళవారం సాయంత్రం 6 గంటలకు విజయవాడ ఎంజి రోడ్ రాఘవయ్య పార్క్ సమీపంలోని బాలోత్సవ భవన్లో జరుగుతుంది. ఐలు, ఐఎఎల్, ఎపిసిఎల్ఎ, ప్రొగ్రెసివ్ ఫోరం ఆధ్వర్యాన జరిగే ఈ సభలో బార్ కౌన్సిల్ సభ్యులు, హైకోర్టు సీనియర్ న్యాయవాదులు, విజయవాడ, గుంటూరు న్యాయవాదులు పాల్గొంటారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలోని తమ్మిన దుర్గారావు నగర్ 11కేవీ ఫీడరు పరిధిలోని విద్యుత్ లైన్ల వార్షిక తనిఖీ, మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 8 నుండి 10 గంటల వరకు ఎన్‌ఆర్‌ఆర్ పేట వెళ్లే దారి, జివిఎస్ ఆపోజిట్ రోడ్, కళ్యాణ్ గౌరీ ఆపోజిట్ రోడ్, చల సాని అపార్ట్మంట్స్ రోడ్, జిమ్ రోడ్, మంజునాథ అపార్ట్మెంట్స్ రోడ్, సన్ సిటీ కాలనీ, జయమ్మ ఐ హాస్పిటల్ రోడ్, స్మైల్ హాస్పిటల్ మైన్ రోడ్, నుజివీడు రోడ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ నగర కార్యనిర్వాహక ఇంజినీరు పి.రవీంద్రబాబు తెలిపారు.

30 మందికి జరిమానా

మద్యం సేవించి వాహనాలు నడిపిన 30 మంది వ్యక్తులకు న్యాయస్థానం జరిమానా విధించింది. 3వ ట్రాఫిక్ పోలీసులు మొత్తం 30 కేసులలో మద్యం సేవించి వాహనాలు నడిపిన చోదకులను సోమవారం సంబంధిత రైల్వే కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి ఆర్.వి.శర్మ 30 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.



బుడమేరు వరద బాధితులకు సాయం చేయాలి

ఇన్చార్జి కలెక్టర్ నిధి మీనాకు సిపిఎం వినతి

ప్రజాశక్తి - విజయవాడ : బుడమేరు వరద బాధితులందరికీ నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ సోమవారం ఎన్‌టిఆర్ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనాకు సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ వినతిపత్రం అందజేశారు. విజయవాడలోని కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కార్యక్రమంలో ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం కాశీనాథ్ మాట్లాడుతూ వదరలు వచ్చి 58 రోజులు గడిచినా ఇప్పటికీ వేలాది మంది బాధితులకు నష్టపరిహారం అందలేదన్నారు. ఎన్మరేషన్ సక్రమంగా జరగలేదన్నారు. తహాశీల్దారు, వార్డు సచివాలయాల్లో బాధితులు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బి రమణారావు, నాయకులు కే దుర్గారావు వై సుబ్బారావు పి కష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విఎంసికి 10 ఫిర్యాదులు

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ఉదయం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు 10 ఫిర్యాదులు అందుకున్నారు. వీటిని త్వరగా పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ శ్రీనాథ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి సజన, ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సుపరింటెండింగ్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి సత్య కుమారి, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, డీఎఫ్ఓ మాల్యాద్రి, ఎస్టేట్ ఆఫీసర్ టీ శ్రీనివాస్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.ఎస్.ఎస్ సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



ప్రతి అర్జీపైనా దృష్టి పెట్టండి : నిధి మీనా

ప్రజాశక్తి - విజయవాడ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందుతున్న ప్రతి అర్జీపైనా ప్రత్యేకంగా దష్టిసారించి, నిర్దేశిత గడువులోగా సరైన పరిష్కారం చూపేందుకు అధికారులు కషిచేయాలని జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ డా. నిధి మీనా అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ నిధి మీనా.. డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు తదితరులతో కలిసి అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా నిధి మీనా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పీజీఆర్ఎస్ వ్యవస్థపై ప్రత్యేకంగా దష్టిసారించినట్లు తెలిపారు. జిల్లాస్థాయి అధికారులు తమ పరిధిలోని క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయంతో పనిచేసి అర్జీల పరిష్కారంపై దష్టిసారించాలన్నారు. ఎప్పటికప్పుడు అర్జీల పరిష్కారానికి సంబంధించిన పురోగతిపై ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 157 అర్జీలు వచ్చాయి.



సిపి కార్యాలయంలో 117 ఫిర్యాదులు స్వీకరణ

ప్రజాశక్తి - విజయవాడ : పోలీస్ కమిషనర్ వారి కార్యాలయంలో మంగళవారం జరిగిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో 117 ఫిర్యాదులు వచ్చాయి. ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నగరంలోని ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించారు. సిపి ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాల మేరకు డిసిపిలు గౌతమి షాలి, ఎ.బి.టి.ఎస్.ఉదయారాణి, క్రైం డిసిపి తిరుమలేశ్వర రెడ్డి బాధితుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు.

ఇసుక మాఫియా బరితెగింపు!

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలు ఆరోపిస్తున్నారు. రాష్టంలో ఎక్కడా లేనివిధంగా ఒక్క నందిగామ నియోజకవర్గంలోని కంచికచర్లలో జరుగుతున్న ఇసుక దందా గురించే చర్చ జరుగుతున్నట్లు సమాచారం. అటు టిడిపి అధిష్టానం వద్ద కూడా ఈ ప్రాంతంలో జరిగే ఇసుక దందా గురించి, ఆ దందాలో కోట్లు దండుకుంటున్న ప్రజా ప్రతినిధుల తీరు గురించి చర్చ జరుగుతున్నట్లు ఆ పార్టీ కార్యకర్తలే చెబుతున్నారు.

హాట్ టాపిక్‌గా ఇసుక అక్రమ రవాణా

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నందిగామ నియోజకవర్గంలో ఇసుక రవాణా, మద్యం షాపుల అక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా హాట్‌టాపిక్‌గా మారాయి. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పథకాన్ని ప్రారంభించిన తర్వాత ఇసుక మరింత యథేచ్ఛగా అక్రమంగా తరలిపోతోంది. నందిగామ నియోజకవర్గంలో గత వైసిపి ప్రభుత్వ హయాంలో వినియోగదారులకు సరఫరా చేసేందుకు పలు డంపింగ్ పాయింట్లలో ఇసుకను నిల్వ ఉంచారు. మూడు నుంచి నాలుగు ఇసుక నిల్వ కేంద్రాల్లో సుమారు 4.5 లక్షల టన్నుల ఇసుక నిల్వలు ఉన్నట్లు అధికారులు లెక్కలు వేశారు. వినియోగదారులకు 3 లక్షల టన్నులు పంపిణీ చేసినట్లు రికార్డులు చూపారు. అయితే ఇంకా మిగిలిన లక్షకుపైగా టన్నుల ఇసుక ఏమైందో నేటికీ తెలియరాలేదు. దీనిలో అధికార పార్టీ నాయకులు చేతి వాటం చూపారని గుసగుసలు వినిపించాయి. ఈనేపథ్యంలో ఇటీవలే తెలంగాణా కేడర్‌కు వెళ్లిపోయిన ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఇద్దరు అధికారులను సస్పెండ్ చేశారు. ఆ తర్వాత భారీ వర్షాలు, వరదలకుతోడు స్టాక్ పాయింట్లలో నిల్వలు లేకపోవడంతో ఉచిత ఇసుక సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. తాజాగా సిఎం చంద్రబాబు... ట్రాక్టర్లలో సైతం ఇసుకను ఉచితంగా రవాణా చేసుకోచ్చని ప్రకటించారు. అంతేగాక ట్రాక్టర్లపై ఇసుక రవాణా చేసుకుంటున్న వారిని ఎవరైనా ఆపితే వారిని కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. ఈ వ్యాఖ్యలతో ఇసుక మాఫియాకు మరింత ఊపు తెచ్చాయి. ప్రకటన వచ్చిందే తడవుగా నియోజకవర్గంలో వందలాది ట్రాక్టర్లు రోడ్డుపైకి వచ్చాయి. కృష్ణానది తీరంతోపాటు మునేరు ప్రాంతమంతా ట్రాక్టర్లతో నిండిపోయాయి. ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు ఇసుకను తీసుకెళ్లి వ్యాపారం ప్రారంభించారు. ఎవరికి వారు సొంత ట్రాక్టర్లతో ఇసుకను తరలించి డంప్‌లు ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాలకు కూడా పంపేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కొంతమంది నందిగామ, కంచికచర్ల ప్రాంతల నుంచి విజయవాడ తరలించి అమ్ముకుంటున్నారు.

ప్రభుత్వం సీరియస్ ?

నందిగామ నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణాపై ప్రభుత్వం సీరియస్ అయినట్లు సమాచారం. ఉచిత ఇసుక పాలసీని అమలు చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై నివేదిక ఇవ్వాలని కోరినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అలాగే కూటమి నాయకులు ఎవరెవరు ఇసుక అక్రమ రవాణాలో భాగస్వాములైన వివరాలు కూడా ఇవ్వాలని కోరినట్లు సమాచారం.

ఆక్రమణలు తొలగించాలని వినతి



ఇంచార్జి ఎంపిడిఓకు వినతిపత్రాన్ని అందిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలం పాపవినాశనం పంచాయితీ శివారు గొల్లపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ రోడ్డు, పిడబ్ల్యూ కాలువ ఆక్రమణకు గురైనట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఆక్రమణలను తక్షణమే తొలగించాలని కోరుతూ గొల్లపాలెం గ్రామస్తులు సోమవారం ఘంటసాల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గకు, మండల పరిషత్ కార్యాలయంలో ఇన్చార్జి ఎంపీడీవో బి.వెంకటేశ్వరరావులకు, ఇరిగేషన్ ఏఈ ప్రసాద్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఆర్ఎస్ నెంబర్-601 నందు గల కాలువ మరియు ఆర్ఎస్ నెంబర్ -596 నందు గల గవర్నమెంట్ ల్యాండ్ జిల్లా పరిషత్ రోడ్డుకి ఆనుకుని ఉన్నందున జిల్లా పరిషత్ రోడ్డుకి యిరువైపుల ఆక్రమణలు జరిగాయన్నారు. జిల్లా పరిషత్ రోడ్డుకి ఒక ప్రక్కన ఉన్న గవర్న మెంట్ ల్యాండ్, పిడబ్ల్యుడి కాలువను ఆరిగ బాబూరావు ఆక్రమించి దారిలేకుండా చేసి పిల్లర్లు పోసి ప్రహరీ గోడను కడుతున్నారన్నారని, రోడ్డుకి మార్జిన్ లేకుండా చేస్తున్నారన్నారు.అడిగితే మీకు చేతనైనది చేసుకోండని, మీకు దిక్కు ఉన్న చోట చెప్పుకోండి అని అంటున్నారన్నారు. జిల్లా పరిషత్ రోడ్డుకి మరో వైపున మన్నెం జాన్ బాబు రోడ్డు మీదకి గోడలు కట్టి దుకాణాలు పెట్టారని, ఈ పిడబ్ల్యుడి కాలువ ఆక్రమణ జరగడం వలన పిడబ్ల్యుడి కాలువ కింద ఉన్న 400 ఎకరాల ఆయకట్టు భూమికి నీరు అందడం లేదన్నారు.

మహిళ అనుమానాస్పద మృతి



ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నంలోని వలందపాలెం, సాంఘిక సంక్షేమ హాస్టల్ సమీపంలో వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం బందరుకు చెందిన పేరం మల్లేశ్వరరావు ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తుంటాడు. మల్లేశ్వరరావుకు అతని భార్య శిరీషకు గత కొంతకాలంగా వివాదాలు కొనసాగుతున్నాయి. అయితే శిరీషాను ఆమె భర్తే చంపాడని, ఆమె ఉరి వేసుకొని చనిపోయినట్లు చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నాడని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న చిలకలపూడి పోలీసులు మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం పోస్ట్‌మార్టం కొరకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ అబ్దుల్ నభి తెలిపారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక లయన్స్ సేవా భవనంలో దుప్పట్లు, అన్నదాన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జంగం నళిని బాయ్ జ్ఞాపకార్థం ఆమె భర్త జంగం మోహన్ రావు ఆర్థిక వితరణతో 100 మంది నిరుపేదలకు దుప్పట్లు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ సభ్యులు, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న దృశ్యం

పారిశుధ్యం మెరుగుదలకు కృషి : కమిషనర్

ప్రజాశక్తి - గుడివాడ : పట్టణంలో శానిటేషన్ మెరుగుదలకు అన్ని చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావులు తెలిపారు. సోమవారం పట్టణంలోని నెహ్రూ చౌక్ సెంటర్, రాజేంద్రనగర్, ఏలూరురోడ్డు, కోతిబొమ్మసెంటర్, బంటుమిల్లిరోడ్, విజయవాడరోడ్, బైపాస్‌రోడ్, ఆర్.టి.సి. బస్టాండ్ రోడ్డు, బేతవోలు, ధనియాలపేట, ఇందిరానగర్‌కాలనీ, వాంబే కాలనీలలో శానిటేషన్ పనులను కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శానిటేషన్ వెహికల్స్‌తో చెత్త సేకరణ నిర్వహిస్తున్నట్లు, ప్రతి వార్డులో సున్నము, బ్లీచింగ్ పౌడర్‌లను క్రమం తప్పకుండా చేయాలన్నారు. మధ్యాహ్నం తప్పని సరిగా గ్యాంగ్ వర్క్‌ను నిర్వహించి, డ్రైనేజీలను శుభ్రం చేయాలన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి-అవనిగడ్డ : ప్రతి అంగన్వాడీ కేంద్రం వద్ద పోషణ వాటిక (కిచెన్ గార్డెన్) ఏర్పాటు చేయడం ద్వారా చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించవచ్చునని అవనిగడ్డ డివిజన్ అగ్రికల్చర్ అధికారి రమేష్ తెలిపారు. సోమవారం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాక్షం స్కీము పై అంగన్వాడి టీచర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిచెన్ గార్డెన్ ద్వారా ఆకుకూరలు, కూరగాయలు పెంచే విధానాన్ని కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఇందులో విత్తనాల శుద్ధి, మట్టి ఎంపిక, బెడ్స్ తయారు తోపాటు మొక్క మొక్కకు ఎంత దూరం ఉండాలి అనేది కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో 61 అంగన్వాడీ సెంటర్లకు చెందిన కార్యకర్తలు, సిడిపిఒ పి సురేష్ కుమారి సూపర్వైజర్లు పాల్గొన్నారు.



31 నుండి ఉచిత గ్యాస్ : జెసి

ప్రజాశక్తి కలెక్టరేట్ (కృష్ణా) : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలులో భాగంగా అర్హులైన పేద కుటుంబాల వారికి సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు అక్టోబర్ 31 నుండి ఉచితంగా అందజేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ తెలిపారు.ఈ పథకం కింద, రాష్ట్రంలో యాక్టివ్ ఎల్పిజి కనెక్షన్, ఆధార్ నెంబర్, బియ్యపు కార్డు, ఆధార్ నెంబరు తో లింకు చేయబడిన బ్యాంకు ఖాతా (ఎకౌంటు) నెంబరు కలిగి ఉన్నవారు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు పొందుటకు అర్హులన్నారు. ఈ పథకం దీపావళి పండుగ పురస్కరించుకొని అక్టోబర్ 31. నుండి ప్రారంభిస్తా మన్నారు. ఈ పథకం కింద ప్రయోజనం పొందకోరు లబ్దిదారులు తమ గ్యాస్ ఏజెన్సీలో గ్యాస్ కొరకు బుకింగ్ చేసి, గ్యాస్ ధరను, గ్యాస్ ఏజన్సీ వారికి మొదట చెల్లించాలని, అనంతరం లబ్దిదారులు అర్హులు అయినచో, వారు గ్యాస్ ఏజెన్సీ వారికి చెల్లించిన పైకం మొత్తము తిరిగి రెండు రోజులలో వారి బ్యాంకు ఖాతాలకు జమ అవుతుందన్నారు.ఈ పథకం క్రింద మొదటి ఉచిత గ్యాస్ సిలిండర్ పొందగోరు లబ్దిదారులు ఈ నెల తేది 29.నుండి 2025 మార్చి 31 తేదీ వరకు తమ గ్యాస్ ఏజెన్సీ వద్ద బుకింగ్ చేసుకోవాలన్నారు. ఐదు నెలల పాటు సమయం ఉందని, కావున లబ్దిదారులు ఎవరు గ్యాస్ బుకింగ్ కొరకు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. ఏమైనా అభ్యంతరాలు/ సూచనలు కలిగిన యెడల టోల్ ఫ్రీ నెంబరు 1967 కాల్ చేసి తెలుప వచ్చున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్‌పి ఆర్. గంగాధరరావు

అంతర్‌జిల్లాల బైక్ దొంగలు అరెస్టు

- 40 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి కలెక్టరేట్ (కృష్ణా) : కృష్ణా జిల్లా పరిధిలో జరుగుతున్న ద్విచక్ర వాహనాల దొంగతనాలను నివారించటంలో ప్రత్యేక దృష్టి సారించి జిల్లాలో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ జల్సాలకు అలవాటు పడిన వారు తమ అవసరాలు తీర్చుకునేందుకు సులువుగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో ద్విచక్ర వాహనాలను దొంగతనాలు చేయడం అలవాటు చేసుకున్నారన్నారు. ఈ క్రమంలో కృష్ణా జిల్లాతో పాటు ఏలూరు జిల్లా, వెస్ట్ గోదావరి జిల్లాలలోని వివిధ ప్రాంతాలలో దొంగతనాలకు పాల్పడ్డారని పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను వీరు అదును చూసుకొని దొంగతనం చేసేవారన్నారు. రూ.47 లక్షల విలువగల 40 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అంతర్ జిల్లాల ద్విచక్ర వాహనాల దొంగల ఆటలకు చెక్ పెట్టి భారీగా ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకోవడంలో కష్టపడిన బందరు సబ్ డివిజన్ పోలీసు అధికారులు మరియు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి నగదు రివార్డులను అందజేశారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని వినతి



ప్రజాశక్తి-ఉంగుటూరు : వరదల వల్ల పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని, నీట మునిగిన ఇళ్లకు పరిహారం అందని వారికి తక్షణమే చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టివి లక్ష్మణస్వామి డిమాండ్ చేశారు. సోమవారం ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద లంకపల్లి, ముక్కపాడు, ఎలుకపాడు, వెల్దిపాడు గ్రామాల వారికి తక్షణమే పరిహారం ఇవ్వాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ స్వామి మాట్లాడుతూ వరదలు వచ్చి నెలలు గడుస్తున్న పరిహారం అందించటంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందని, తక్షణమే బాధితులను గుర్తించి పరిహారం ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నీట మునిగిన ఇళ్లకు పరిహారం తో పాటు ప్రభుత్వం ఇస్తున్న కిట్లు కూడా నేటికీ అందలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి అజ్మీరా వెంకటేశ్వరరావు, రైతులు కంచర్ల విష్ణు, గుండె ప్రసాద్, రమేష్, ఆశాజ్యోతి, నీలిమ, కుమారి, రత్నకుమారి, శివ కోటేశ్వరరావు, బొకినాల నిరీక్షణ రావు పాల్గొన్నారు.

అరుణాచలంకు ప్రత్యేక బస్సు

ప్రజాశక్తి-ఉయ్యూరు : అరుణాచల యాత్రకు ఉయ్యూరు నుండి నవంబరు 4 రాత్రి సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కెఎస్ఆర్కె ప్రసాద్ తెలిపారు. 4వ తేదీ సోమవారం రాత్రి 8 గంట లకు స్థానిక ఆర్టీసీ బస్ స్టాండ్ నుండి బస్సు బయలుదేరి మరుసటి రోజు ఉదయం కపిలతీర్థం చేరుకుని అక్కడనుండి అలివేలుమంగాపురం, కాణిపాకం వినాయకుని దర్శనం అనంతరం సిరిపురం గోల్డెన్ టెంపుల్లో దైవదర్శనం అక్కడ నుండి అరుణాచ లం చేరుకుంటుందన్నారు. అక్కడ గిరి ప్రదక్షణ చేసుకుని దర్శనం తరు వాత బయలుదేరి బుధవారం కాంచిపురం, విష్ణుకంచి, కామాక్షమ్మ గుడి, బంగారుబల్లి దర్శనం చేసుకుని తిరుత్తణి కుమారస్వామి దర్శించుకుని గురువారం ఉదయం శ్రీకాళహస్తి, కోటప్పకొండ దర్శనం తరువాత ఉయ్యూరు చేరుకుంటుందని తెలిపారు. ఆసక్తి కలవారు ఓపిఆర్ఎస్ ఏజెంట్ల వద్ద, ఏపిఎస్ఆర్టీసీ ఆన్లైన్లో సర్వీసు నంబరు 95599లో రిజర్వేషన్ చేసుకోవచ్చున్నారు. ఇతర వివరాలకు 891936 6868, 9553205796 సెల్ నంబర్లకు సంప్రదించ వచ్చని పేర్కొన్నారు.

గుడివాడ జీవీ మాల్‌లో మంటలు

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక పోస్టు ఆఫీసురోడ్డులోని జివిమాల్‌లో సోమవారం మంటలు వ్యాపించాయి. జివి మాల్ పై అంతస్తులో మంటలు వ్యాప్తి చెందడంతో ఫైర్ సిబ్బంది వెంటనే స్పందించి మంటలను అదుపుచేశారు. పై అంతస్తులో ఏసీల కంప్రెసర్ల నుండి మంటలు వ్యాప్తి చెందినట్లు ఫైర్ అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఏటువంటి ఆస్తి నష్టం జరగలేదని తెలిపారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని జై భీమ్ భారత్ పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ ఇన్చార్జి సముద్రాల అంబేద్కర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన అవనిగడ్డలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా నిరుద్యోగులకు రూ3000 రూపాయలు నిరుద్యోగ భృతి అందిస్తామని, అదేవిధంగా మహిళలకు 1500 రూపాయలు నెలల అందజేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. అదేవిధంగా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం ద్వారా అంది అన్ని రకాల సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని, ఎస్సీ ఎస్టీల బ్యాక్లాగ్ పోస్టులను ప్రతి ఏడాది భర్తీ చేస్తామని, 50 సంవత్సరాలకే బీసీలకు పెన్షన్ అందజేస్తామని ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

టపాసుల గోడౌన్లో దొంగల బీభత్సం



గోడౌన్ లోపల దొంగలు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం కోనాయి చెరువు దగ్గరలో గల దుర్గ భవాని దీపావళి టపాసులు గోడౌన్ లో సోమవారం తెల్లవా రుజాము దొంగలు బీభత్సం సష్టించారు. పోలీసుల కథనం ప్రకారం నలుగురు దొంగలు నలుపు రంగు దుస్తులు ధరించి గోడౌన్ పైన రేకులు తొలగించి లోపలకు ప్రవేశించారు. సుమారు లక్ష రూపాయల విలువైన టపాసులను దొంగిలిం చారు. గోడౌన్ రేకులు పగలగొట్టి ప్రవేశించిన దృశ్యాలు సీసీ ఫుటేజ్లో నమోదు అయ్యాయి. గోడౌన్ యజమాని ఫిర్యాదు మేరకు గన్నవరం పోలీసులు రంగంలోకి దిగారు. పాత నేర స్తులు ఈ దొంగతనానికి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

ఎల్ఐసి ఏజెంట్ల నిరసన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఎల్ఐసి యాజమాన్యం ప్రవేశపెట్టిన నూతన నిరంకుశ విధానాలకు నిరసనగా ఆలిండియా యూనియన్ నాయకుల పిలుపుమేరకు పట్టణంలోని ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయం వద్ద ఏజెంట్లు సోమవారం నిరసన తెలిపారు. 28వ రోజు బ్రాంచ్ కార్యాలయం వద్ద చేపట్టిన కార్యక్రమంలో యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఎల్ఐసి పాలసీలపై జిఎస్టి రద్దు చేయాలని, పాలసీలను పాత పద్ధతిలోనే కొనసాగించాలని, పాలసీలపై బోనస్‌ను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి బ్రాంచ్ ప్రెసిడెంట్ ఎం కొండయ్య, సెక్రటరీ ఏ సైదులు, ట్రెజరర్ టీ నరేంద్ర కుమార్, జోనల్ ఈసీ మెంబర్ పిసి వెంగళరావు, డివిజన్ జాయింట్ సెక్రటరీ జి మురళీకృష్ణ పాల్గొన్నారు.



తిరువూరులో శాంతి ర్యాలీ

ప్రజాశక్తి-తిరువూరు: పోలీస్ అమరవీరుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా తిరువూరులో పోలీసులు విద్యార్థులతో కలిసి సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. చీరాల సెంటర్ నుండి బోసుబొమ్మ సెంటర్ మీదుగా మధిర రోడ్డు వరకు ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో ఎస్సైలు సత్య నారాయణ, వెంకట్రావు, ఎఎస్ఐ కృష్ణారెడ్డి, నాగార్జున కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.



3న గాజుల మహోత్సవం

ప్రజాశక్తి-వన్‌టౌన్: దుర్గగుడిలో నవంబర్ 3వ తేదీన అమ్మవారి గాజుల మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కెఎస్ రామారావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ అమ్మవారి గాజుల మహోత్సవం పురస్కరించుకొని గాజులతో శ్రీ అమ్మవారి అలంకరణ మరియు ఆలయ అలంకరణ నిమిత్తం సోమవారం శ్రీ కనక దుర్గా లలితా పారాయణ బృందం ఆలయ ఈవో కె.ఎస్.రామారావుని కలిసి సుమారు 99,360 చెక్కుడు గాజులను విరాళంగా అందజేశారు.



పార్కింగ్ ఫీజు వసూలు తగదు

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఆటో కార్మికుల నుంచి పార్కింగ్ ఫీజు వసూలు తగదని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. సోమవారం గుడ్స్ ఆటో వర్క్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కెనాల్ రోడ్డు రథం సెంటర్లో వార్షికోత్సవం, జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కోటేశ్వరరావు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో కెనాల్ రోడ్డులోని పార్కింగ్ ఫీజులతో విచ్చలవిడిగా వారు తోచ్చిన పద్దతిలో పార్కింగ్ ఫీజులు వసూలు చేస్తున్నారని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ స్పందించి ఉపాధి జీవనం కొన్నసాగించే ఆటో కార్మికుల నుంచి పార్కింగ్ ఫీజు లేకుండా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్షులు కే.ఆర్. ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు, సహకారదర్శి కొట్టు రమణారావు, ఉపాధ్యక్షులు కంచర్ల నాగేశ్వరరావు, గూడ్స్ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్కే కరీముల్లా, పి.నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం కెనాల్ రోడ్డు మీదగా ప్రదర్శనగా నగరపాలక సంస్థ నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వెళ్లి చీఫ్ ఇంజనీర్ శ్రీనాథ్‌రెడ్డికి విజ్ఞాపన పత్రం అందజేశారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-వన్‌టౌన్: భవానీపురం 40వ డివిజన్ పరిధిలోని లారీ డ్రైవర్ పెనుబోతుల రాంబాబు (48) ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. మతునికి ఇద్దరు పిల్లలు. నిరుపేదలైన రాంబాబు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేయాలని 40వ డివిజన్ టిడిపి అధ్యక్షులు పి.వి. చిన సుబ్బయ్య ఎమ్మెల్యే సుజనాను కోరగా తక్షణమే ఆర్థిక సాయం అందజేయాలని తమ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది సోమవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి భరోసా కల్పించారు. మతుని భార్యకు ఆర్థిక సాయం అందించారు.

నివాస ప్రాంతాల్లో మద్యం దుకాణాలొద్దు

సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు



ప్రజాశక్తి-విజయవాడ: నివాస ప్రాంతాల మధ్యలో ఏర్పాటు చేసిన మద్యం, బార్ షాప్‌ల లైసెన్స్‌ను వెంటనే రద్దు చేయాలని సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరపాలక సంస్థ ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ శ్రీనాథరెడ్డికి సత్యబాబు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ విజయవాడ పశ్చిమ నియోజకవర్గం గులాం మొహిద్దీన్ వీధిలో నివాస గృహాల మధ్య విద్యాలయాలకు అతి సమీపంలో మద్యం బార్ షాపు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన లైసెన్స్ అనుమతి వెంటనే రద్దు చేయాలని కోరారు. నగరంలో ఇప్పటికీ అనేక ప్రాంతాలలో గంజాయి, మద్యం సులభతరంగా లభించడం వలన అవి సేవించిన వారు మహిళలపై, బాలికలపై లైంగిక వేధింపులకు, అత్యాచార, హత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. వాటిని అదుపు చేయవలసిన రాష్ట్ర ప్రభుత్వం వన్‌టౌన్ నగరం మధ్య ప్రాంతంలో ముఖ్యంగా వ్యాపార కూడలి, నివాస గహాల మధ్య మద్యం బార్ షాపు ఏర్పాటుకు లైసెన్స్ అనుమతి ఇవ్వడాన్ని స్థానిక ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారన్నారు. వెంటనే అనుమతులను రద్దు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన చీఫ్ ఇంజనీర్ వెంటనే తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

ఇఎస్ఐ వాటా జమ చేయాలి

అలాగే నగరపాలక సంస్థ వివిధ విభాగాలలో ప్రైవేట్ కాంట్రాక్టర్ ద్వారా సప్లై చేయబడిన శానిటేషన్ కార్మికులకు మరియు శానిటేషన్ ఆప్కాస్ కార్మికులకు వారి వేతనాలు నుండి మినహాయించబడిన ఈఎస్ఐ అండ్ ఈపీఎఫ్ షేర్ వాటా రుసుము ఆ ఎంప్లాయిస్ ఖాతాలకు వెంటనే జమ చేయాలని కోరారు. ఈ అంశంపై కూడా చీఫ్ ఇంజినీర్‌కు సత్యబాబు వినతిపత్రం అందజేసి మాట్లాడారు...కార్మికుల ఖాతాల్లో జమ చేయకుండా సదరు కాంట్రాక్టర్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. దీని వలన కార్మికులు తీవ్ర ఆర్థిక ,ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఎంప్లాయిస్ కు సంబంధించిన ఈపీఎఫ్ అండ్ ఈఎస్ఐ షేర్ వాటా ధనం ప్రైవేట్ కాంట్రాక్ట్ సంస్థ వారు కార్మికుల ఖాతాలో జమ చేసే విధంగా తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఈఎస్ఐ షేరు ధనం చెల్లించిన కార్మికులకు గుర్తింపు కార్డులు లేకపోవడం వలన ప్రమాదాలు జరిగినప్పుడు ఆ కార్మికులు వైద్యశాలకు వెళ్ళినప్పుడు గుర్తింపు కార్డులు లేకపోవడం వలన వైద్య సౌకర్యాలు కల్పించడానికి వైద్యశాలలలో అనుమతించడం లేదని అన్నారు.కార్మికులకు ఈఎస్ఐ గుర్తింపు కార్డులను ఆయాసంస్థల నుండి నగరపాలక సంస్థ నేరుగా సప్లై చేసే విధంగా తగు చర్యలు చేపట్టాలని కోరారు.

హాకర్లకు అనుమతివ్వాలని వినతి



ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ లెనిన్ సెంటర్లో యధాస్థానంలో వ్యాపారాలు చేసుకుంటానికి చిరు వ్యాపారస్తులకు అనుమతి ఇవ్వాలని సోమవారం విఎంసిలో జరిగిన గ్రీవెన్స్‌లో విజయవాడ తోపుడు బండ్లు, హాకర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ 35 సంవత్సరాలకు పైగా చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న వారిని తొలగించి ఐదు రోజులు కావస్తుందని, దీంతో ఆయా కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయని చెప్పారు. చిరు వ్యాపారాలు తొలగించిన సందర్భంలో లక్షల రూపాయల్లో సామాగ్రి పాడైపోయిందని, వ్యాపారాలు చేసుకునే బండ్లు దెబ్బతిని పనికి రాకుండా పోయాయని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి గతంలో లాగానే వ్యాపారాలు చేసుకుంటానికి అనుమతివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె.దుర్గారావు, కార్యదర్శి వై.సుబ్బారావు, నాయకులు బాలబొమ్మ లక్షణ, హాకర్స్ యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు బెవర వెంకటేశ్వరరావు, సిహెచ్ మురళి, కె.గోపి, సిహెచ్.వెంకటరమణ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌పి కాల్వలపై గండ్లు పూడ్చివేతకు చర్యలు : వసంత



ప్రజాశక్తి-మైలవరం: మైలవరం నియోజకవర్గ పరిధిలోని నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ (ఎన్ఎస్‌పి) కాల్వలపై ఇటీవల అకాల వరదల ధాటికి పడిన గండ్లు పూడ్చివేతకు యుద్ధప్రాతిపదిక చర్యలు తీసుకోవాలని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు సంబంధిత అధికారులను ఆదేశించారు. మైలవరం పట్టణంలోని ఆయన కార్యాలయంలో సోమవారం ఎన్ఎస్‌పి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండపల్లి మేజర్, జక్కంపూడి మేజర్, చెవుటూరు మేజర్, వెల్వడం మేజర్, జమలాపురం మేజర్, రంగాపురం మేజర్, నూజివీడు, మైలవరం బ్రాంచ్ కాల్వలకు ఇటీవల సంభవించిన ఆకస్మిక వరదలకు పలుచోట్ల గండ్లు పడ్డాయన్నారు. దాని కారణంగా ఆయకట్టుకు సాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడతాయని పేర్కొన్నారు. గండ్లు పూడ్చివేతతో ఎన్ఎస్‌పి జలాలు సవ్యంగా సరఫరా అయ్యేవిధంగా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. నవంబర్ 15 నుంచి సాగర్ జలాలు విడుదల చేయనున్న దృష్ట్యా ఎటువంటి ఆటంకాలు లేకుండా కాల్వలకు మరమ్మతులు చేపట్టి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో సాగునీరు సరఫరా చేసి చెరువులను నింపాలన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడిన చినదుర్గారావు

సిపిఎం రాష్ట్ర నాయకులు తులసీరావు

ప్రజాశక్తి-ఎ.కొండూరు: సిపిఎం నాయకులు, కంభంపాడు మాజీ ఎంపీటీసీ పి.చిన్న దుర్గారావు క్రమశిక్షణ గల నాయకుడిగా ప్రజాసమస్యలపై పోరాటాలు నిర్వహించారని సిపిఎం రాష్ట్ర నాయకులు బిఆర్ తులసీరావు అన్నారు. సోమవారం కంభంపాడులో చిన్న దుర్గారావు సంతాప సభ చిర్రా కనకయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సభలో ఆయన మాట్లాడుతూ సిపిఎం అభివృద్ధికి చిన్న దుర్గారావు ఎంతో కృషి చేశారన్నారు. ఎంపీటీసీ సభ్యునిగా ఎన్నికైన తర్వాత ప్రజా సేవే లక్ష్యంగా పనిచేసి ప్రజల మన్ననలను పొందారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు బలరామయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి ఆంజనేయులు, కోట కళ్యాణ్, మైలవరం, తిరువూరు రూరల్, ఎం.కొండూరు మండలాల కార్యదర్శులు సుధాకర్, ఎస్.వెంకటేశ్వరరావు, జెట్టి వెంకటేశ్వరరావు, నాయకులు పంబి వెంకటేశ్వరావు, సోమా యోహాను, ఆళ్ల అమ్మిరెడ్డి, రావుల రామకృష్ణ, డి.చిన్న లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తులసీరావు



ఈత పోటీల విజేతలకు అభినందన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధర్యంలో ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ గుంటూరు మున్సిపల్ స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన 5వ స్టేట్ ఛాంపియన్షిప్ ఈత పోటీల్లో కోచ్ దంపతులు పొట్టాబత్తిన పాండురంగారావు, లక్ష్మి ఆధ్వర్యంలో ఎనిమిది మంది పురుషులతో కూడిన జట్టు మొత్తం 17 పతాకాలు సాధించింది. ఈ సందర్భంగా విజేతలను జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్, మాజీ మంత్రి నెట్టెం రఘురాం, మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రరావు, మాజీ కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరావు, కష్ణా స్విమ్మర్స్ వ్యవస్థాపక అధ్యక్షులు కిషోర్‌బాబు తదితరులు అభినందించారు.

నట్టల నివారణ మందు పంపిణీ

ప్రజాశక్తి-చందర్లపాడు

మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో సోమవారం మేకలు, గొర్రెలకు ఉచిత నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. గొర్రెల మేకలు పెంపకందారుల సహకార సంఘం అధ్యక్షులు అల రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా మేకల పెంపకందార్ల చైర్మన్ దుద్దుకూరి వెంకటకృష్ణ మాట్లాడుతూ రైతులకు గోర్రెల సంఘం ఉపయోగాలు, హక్కులు గురించి, ప్రభుత్వ పథకాలు గురించి వివరించి వాటిని ఉపయోగించుకోమని తెలిపారు. ఈ సందర్భంగా మొత్తం 3150 గొర్రెలు మేకలకు ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముప్పాళ్ల పశు వైద్యాధికారి డాక్టర్ బి.నీరజ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



'మీకోసం' అర్జీలకు అధిక ప్రాధాన్యత : జెసి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ప్రజల నుండి అందే అర్జీలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి సకాలంలో పరిష్కరించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంయుక్త కలెక్టర్ డిఆర్ఓ కె చంద్రశేఖర రావు, కే ఆర్ ఆర్ సి ఎస్డిసి శ్రీదేవి, మచిలీపట్నం ఆర్డిఓ కే స్వాతిలతో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. కలెక్టరేట్ లో మొత్తం 128 అర్జీలను జిల్లా యంత్రాంగం స్వీకరించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చిన అర్జీలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. ప్రస్తుతం 108 అర్జీలు సిఎంఓ నుండి వచ్చాయని అవన్నీ నిర్ణీత గడులోగానే ఉన్నాయని, అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అర్జీదారునికి అర్థమయ్యే రీతిలో సమాధానాన్ని రిజిస్టర్ పోస్ట్ ద్వారా గాని వాట్సాప్ ద్వారా గాని పంపాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా వీడి శివప్రసాద్, జిల్లా గృహ నిర్మాణ అధికారి వెంకట్రావు, డిసిహెచ్ఎస్ డా.శ్రావణ్ కుమార్, జడ్పిసిఈఓ కే కన్నమ నాయుడు, మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్, పశుసంవర్ధక అధికారి చిన్న నరసింహులు, డిఎస్ఓ పార్వతి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు కనీస వసతులు కల్పించాలి : ఎపి రైతు సంఘం

గుడివాడ- బంటుమిల్లి ప్రాంతాలకు వెళ్లే బస్సులు తగ్గించకుండా, ఆలస్యం లేకుండా ప్రయాణికులకు ముఖ్యంగా విద్యార్థులు, వద్ధులు, మహిళలకు అసౌకర్యం కలగకుండా నిర్వహించాలని కోరుతూ రాష్ట్ర రైతు సంఘం కష్ణా జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు అర్జీ అందజేశారు.

నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలి :ఘంటసాల సర్పంచ్


ఘంటసాల సర్పంచ్ బి వెంకటేశ్వరమ్మ, గ్రామస్తులు ధామ నాంచారమ్మ, మునగాల సూర్యకుమారి, ఎం సురేష్, టి మాలతి తదితరులు తమ గ్రామంలో మల్లంపల్లి వెళ్ళు మార్గంలో పాత సంత బజారులో నివాసం ఉంటున్న పాత లంక సుబ్బమ్మ అనే మహిళ నివాసం ఉంటున్న ఇంటిని మద్యం షాపుగా ఏర్పాటు చేశారని, అక్కడినుండి ఊరు శివారు ప్రాంతానికి మార్చాలని కోరుతూ అర్జీ అందజేశారు.



అర్జీలు అందజేస్తున్న దృశ్యం

తాగు నీరు సరఫరాకు చర్యలు తీసుకోవాలి : ఎస్.ఎన్.గొల్లపాలెం గ్రామస్తులు

బందరు మండలం ఎస్.ఎన్.గొల్లపాలెం గ్రామానికి చెందిన పెనుబోతు నాగ శివరాం, ఏ.రాజ్యలక్ష్మి, కే భారతి పి. శివకుమారి తదితరులు అర్జీల అందజేశారు. తమ గ్రామంలో బోరు నీటిలో ఉప్పు శాతం ఎక్కువగా ఉందని తాగడానికి యోగ్యంగా లేక తీవ్రమైన తాగునీటి కొరతతో. చాలా అవస్థలు పడుతున్నామని మంచినీరు ఏర్పాటు చేయాలని అర్జీ అందజేశారు.



మొవ్వ మండలంలో అర్జీ అందిస్తున్న దృశ్యం

గ్రామసభల్లో అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి-మొవ్వ :గతంలో జరిగిన భూముల రీసర్వేలో ఏమైనా తప్పులు దొర్లితే రైతులు సరి చేయించుకోవాలని డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారి శివరామ ప్రసాద్ సూచించారు. మొవ్వ మండలం అయ్యంకి గ్రామపంచాయతీ కార్యాలయంలో రీ సర్వేలో జరిగిన భూ సమస్యల పరిష్కారం కోసం రీసర్వే ప్రాజెక్టు పర్యవేక్షణలో నిర్వహించిన గ్రామ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని రైతులకు పలు సూచనలు ఇచ్చారు. పొలం విస్తీర్ణం, ఫోన్ నెంబర్లు, సర్వే నంబర్లు తదితర అంశాలలో తప్పులు వచ్చినట్లయితే సరిచేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అయ్యంకి గ్రామంలో 2316. 33 ఎకరాలలో నిర్వహించిన రీసెర్వేపై జరిగిన సభలో గ్రామ సర్పంచ్ నాగనబోయినసునీల్ కుమార్, రీ సర్వే డిప్యూటీ తాసిల్దార్ పి జగన్ మోహన్ రావు, మండల సర్వేయర్ ఏ. కిషోర్, సచివాలయ సర్వేయర్ వీర్ల కావ్య, వీఆర్వో ఎస్ నరసింహారావు, కార్యదర్శి ఎన్.ప్రభు కుమార్ తోపాటు పెడసనగల్లు, భట్లపెనుమర్రు, అవురుపూడి, మొవ్వ-1 సర్వేయర్లు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభల ద్వారా రైతులు పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని డిటి రత్న కుమారి అన్నారు. మండలంలోని ఉలవలపూడి గ్రామం లో సోమవారం రీ సర్వే భూ సమస్యల పరిష్కార కార్యక్రమ గ్రామసభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ పర్వీన్ సుల్తానా, గ్రామ సర్పంచ్ పామర్తి కన్య భాస్కర్‌రావు, వీఆర్వో మల్లికార్జునరావు, రైతులు పాల్గొన్నారు.

పోలీసు ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర రావు సోమవారం విద్యార్థులతో కలిసి రిబ్బన్ కత్తిరించి ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల రక్షణ, ప్రజా శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమిస్తున్న పోలీస్ శాఖ విధి నిర్వహణ, వారు విధుల్లో ఉపయోగించే ఆయుధాలు, ఇతర పరికరాలు గూర్చి ప్రజలకు తెలుసుకోవాలని ఉచ్చుకత ఉంటుందని, అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్స వాల్లో భాగంగా అన్ని రకాల ఆయుధాలు వాటి పని తీరును ఓపెన్ హౌస్ కార్యక్రమం ద్వారా ప్రదర్శిస్తున్నా మన్నారు. వీటిని విద్యార్థులంతా ఎంతో ఉత్సాహంగా వినియోగించుకుంటున్నారని తెలిపారు. పోలీసులు వారి యొక్క విధి నిర్వహణలో ఉపయోగించే వివిధ రకాల వాహనాలు, అన్నింటిని పరిశీలించారు. ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని, విద్యార్థులకు ముందుగా జాగిలాలు ప్రదర్శన చిన్నారులను ఎంతగానో అలరించింది. పోలీసులు శాంతిభద్రతలు కాపాడటానికి,సంఘవిద్రోహ శక్తులను నిరోధించడానికి వినియోగించే అత్యాదునిక ఆయుధాలు, ఏ కె-47, మెషిన్ గన్లు, రివాల్వర్లు, పిస్టల్ లు, గ్రేనేడ్లు, టియర్ గ్యాస్ షెల్, వైర్ లెస్ సెట్, డిహెచ్ఎండి, హెచ్ హెచ్ఎండి, బాంబు డిస్పోజల్ సిబ్బంది వినియోగించే పరికరాలు, బాడీ వార్న్ కెమెరాలు, నేరం జరిగినప్పుడు క్లూస్ టీం ఏ విధంగా ఆధారాలు సేకరించేది, వారి దర్యాప్తులో ఉపయోగించే పరికరాలు, వైట్ కాలర్, లోన్ యాప్, ఓటిపి వంటి నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఐటి వింగ్ సిబ్బంది ప్రదర్శించిన పోస్టర్లు, డాగ్ స్క్వాడ్ వారు వినియోగించే పరికరాలు, పోలీసు జాగిలాలు, ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నియంత్రించదానికి వినియోగించే స్టాపర్స్, బ్రీత్ ఎనలైజర్స్, సమాచారం కోసం ఉపయోగించే మ్యాన్ ప్యాక్స్ మొదలగు వాటి పని తీరు గురించి విద్యార్థిని, విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో , ఇంచార్జ్ అడిషనల్ ఎస్పీ అడ్మిన్ బి. సత్యనారాయణ పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



ఆయుధాల వాడకంపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌పి

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక లయన్స్ సేవా భవనంలో ఈనెల 29వ తేదీ మంగళవారం మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశికళ తెలిపారు. శ్రీ సురక్ష మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ గుడివాడ వారిచే జనరల్ మెడిసిన్, ఊపిరితిత్తుల వ్యాధులు, కిడ్నీ సమస్యలు, ఎముకలు, గుండెకు సంబంధించిన వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డెల్టా పరిరక్షణకు అంబటి లక్ష్మణరావు కృషి



సభలో మాట్లాడుతున్న అక్కినేని భవాని ప్రసాద్

ప్రజాశక్తి-అవనిగడ్డ : కృష్ణా డెల్టా పరిరక్షణకు జస్టిస్ అంబటి లక్ష్మణరావు చేసిన కృషి మరువలేనిదని ప్రముఖ సాగునీటి రంగ నిపుణులు అక్కినేని భవాని ప్రసాద్ తెలిపారు. సోమవారం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద అలహాబాద్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి కీర్తిశేషులు జస్టిస్ సంపత్ లక్ష్మణరావు సంతాప సభ నిర్వహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భవాని ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ బ్రిజేష్ కుమార్ ట్రిబునల్ తీర్పును ఎదుర్కొనేందుకు తాము రూపొందించిన నివేదికను న్యాయపరంగా పటిష్ఠంగా తీర్చిదిద్దటంలో లక్ష్మణరావు పాత్ర మరువలేనిది అన్నారు. ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ అనంతరం రైతాంగ సంక్షేమానికి కషి చేశారన్నారు. కష్ణ డెల్టా సంక్షోభం ఏర్పడినప్పుడు అక్కినేని భవాని ప్రసాద్ తో తాను కలిసి చేపట్టిన కార్యక్రమాలకు మార్గదర్శ కులుగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రాం, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మతి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు మట్టి శ్రీనివాసరావు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, టిడిపి కోడూరు మండల పార్టీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావు పాల్గొన్నారు

యోగాలో సాత్వికకు బంగారు పతకం



ప్రజాశక్తి-చల్లపల్లి : ప్రపంచ ఆక్యుపేషనల్ థెరపీ డే సందర్భంగా ఆదియోగి పరమేశ్వర యోగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన మూడవ రాష్ట్ర స్థాయి యోగ కాంపిటీషన్, 2024 లో పమిడిపాటి సాత్విక బంగారు పతకం సాధించింది .చల్లపల్లి ఆర్ ఐ ఘంటసాల కష్ణ మోహన్ పెద్ద కుమార్తె రమ్య వల్లి, రవి శంకర్ ల కూతురు సాత్విక ఈ గోల్డ్ మెడల్ సాధించటం పట్ల పలువురు సాత్విక ను అభినందించారు.



15వ రోజుకు వ్యాన్ డ్రైవర్ల సమ్మె

పెనమలూరు : మూడు నెలల జీతాలు అందించాలని కోరుతూ తడి, పొడి చెత్త వ్యాన్ డ్రైవర్లు చేస్తున్న సమ్మె సోమవారానికి 15వ రోజుకు చేరింది. మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ కిరణ్‌లతో కార్మికులు, సిఐటియు నాయకులు చర్చించగా రెండు రోజుల్లో జీతాలు వేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో . పెనమలూరు మండల సిఐటియు నాయకులు మస్తాన్వలి, తాడిగడప మున్సిపాలిటీ సిఐటియు నాయకురాలు సరళ, వాన్ డ్రైవర్ల సిఐటియు నాయకులు మస్తాన్ బ్రహ్మం సూరి నారాయణ, శ్రీహరి, నాగరాజు, శివ శంకర్, బూసి బాబు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-నాగాయలంక : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా స్విమ్మింగ్ సెలక్షన్స్ పెనమలూరులోని బ్లూమింగ్ డేల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈనెల 27వ తేదీన జరిగాయి. వీటిలో నాగాలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు కొక్కిలిగడ్డ విన్ని, నాగిడి అశ్విని ప్రతిభ కనపర్చి రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ కాంపిటీషన్స్‌కి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానో పాధ్యాయులు పివిఎన్వి ప్రసాద్ తెలిపారు.వచ్చే నెల ఐదో తేదీన నరసరావ ్ర పేటలో జరిగే రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ కాంపిటీషన్స్‌లో వీరు పాల్గొంటారన్నారు. అద్భుతమైన ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ కాంపిటీషన్స్ కి ఎంపికైన విద్యార్థులను పాఠశాల పిఎంసి చైర్మన్ ఒక్కపట్ల మారుతి, ఫిజికల్ డైరెక్టర్స్ గాజుల లక్ష్మీ, ప్రసాద్, కోసూరు పూర్ణచంద్రరావులు అభినందించారు.

పంటలపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-పమిడిముక్కల : మండలంలోని మర్రివాడ గ్రామంలో రైతులకు వివిధ పంటలపై శిక్షణ కార్యక్రమం డిఆర్‌సిడిడిఏ జ్యోతిర్మయి ఆధ్వర్యంలో సోమవారం జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పంట చివరి దశలో ఉన్నందున రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను వచ్చే నెల నుండి తెరుస్తామని మండల వ్యవసాయ అధికారి గణేష్ రెడ్డి తెలిపారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా ధాన్యం సంచులను పెంచాలని రైతులు కోరారు. గోపువానిపాలెం గ్రామ సర్పంచ్ యార్లగడ్డ భూషయ్య, యార్లగడ్డ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-విజయవాడ: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజయవాడ కార్పొరేషన్ కార్యాలయం వద్ద కార్మికులు మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఎసిజికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నగర గౌరవాధ్యక్షులు ధోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ డివిజన్లో విస్తరణ మేరకు కార్మికుల సంఖ్యను అన్ని విభాగాల్లో పెంచాలని, పార్కు, వాటర్, వెహికల్ డిపో, మెకానిక్ సెక్షన్ కార్మికులందరికీ జీతాలు పెంచాలని, క్లాప్ ఆటో కార్మికులకు జీతాలు పెంచాలని, స్థానిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ కార్మికులకు 45 మందికి వరదల్లో ఇచ్చిన షోకాజు నోటీసు వెనక్కి తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతూ వాళ్లకు రావాల్సిన నెల పూర్తి జీతం వెంటనే ఇవ్వాలని కోరారు. వరదల కారణంగా రాలేకపోయినా కార్మికులందరికీ 12 రోజుల జీతం అకౌంట్లలో వేయాలన్నారు. వెహికల్ డిపోలో ఉన్న 35 మంది క్లీనర్లను డ్రైవర్లగా ప్రమోట్ చేయాలన్నారు. మెకానిక్ విభాగంలో కూడా సీనియార్టీ ప్రకారం హెల్పర్లను మేస్త్రిలుగా ప్రమోట్ చేయాలన్నారు. కార్మికులకు ఇవ్వాల్సిన సబ్బులు, కొబ్బరి నూనె, చెప్పులు, తోపుడు బండ్లు, యూనిఫామ్ వెంటనే ఇవ్వాలని కోరారు. ఈ ఆందోళనకు సిపిఎం కార్పొరేటర్ బోయి సత్తిబాబు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్షులు ఎస్.జ్యోతిబస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.ప్రవీణ్, ఉపాధ్యక్షులు ధనికొండ వెంకటేశ్వరరావు, వెహికల్ డిపో ప్రధాన కార్యదర్శి జలసూత్రం నాగరాజు, దుర్గాప్రసాద్, సుందరయ్య, టి తిరుపతమ్మ, జె.విజయలక్ష్మి, యు.సాంబులు, శీలం దాసు, టి.చిన్న తదితరులు పాల్గొన్నారు. **తిరువూరు:** తిరువూరు నగర పంచాయతీ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం కార్మికులు ధర్నా చేశారు. అనంతరం శానిటరీ ఇన్‌స్పెక్టర్ జగదీష్ వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి బలగాని వెంకటేశ్వరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు చట్టబద్ధమైన సౌకర్యాలు, సెలవులు, రక్షణ పరికరాలు, వాహనాల మరమ్మతులు, పనిముట్లు సకాలంలో ఇవ్వడంలో ప్రభుత్వం జాప్యం చేస్తుందన్నారు. గత ఏడు సంవత్సరాల నుండి అదనపు కార్మికుల పేరుతో పని చేస్తున్న కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోదుగు సురేష్, సిహెచ్ నాగరాజు, ఎం.నాగరాజు, కృష్ణవేణి, నరసరావు, వెంకటేశ్వరావు, కాటంరాజు, వెంకటరమణ, బాబురావు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ సోమవారం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జగ్గయ్యపేట మండల కార్యదర్శి షేక్ గౌస్‌మియా మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బందిని పెంచాలని, పనిముట్లు, భద్రత రక్షణ పరికరాలు ఇవ్వాలని, ఇంజనీరింగ్ కార్మికులకు, క్లాప్ డ్రైవర్లకు జీవో నెంబర్ 36 ప్రకారం జీతాలు చెల్లించాలని, ఎంఆర్‌ఎం, కోవిడ్, బదిలీ కార్మికులకు, మున్సిపల్ కార్మికులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పారా ఎలకమ్మ, బుజ్జి, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.


తిరువూరులో...


జగ్గయ్యపేటలో...



పారిశుధ్య కార్మికుల వినతి

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం పారిశుధ్య కార్మికులు ధర్నా చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఇవి రమణబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడుతూ కార్మికులకు చట్టబద్ధమైన సౌకర్యాలు, సెలవులు, రక్షణ పరికరాలు ఇవ్వాలని, వాహనాల మరమ్మతులు చేయాలని, పనిముట్లు సకాలంలో ఇవ్వాలని, యూనిఫాం, చెప్పులు, సబ్బులు, నూనెలు, టవల్స్ సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. నందిగామ పట్టణాల విస్తరణ మేరకు సిబ్బంది సంఖ్య ఏళ్ల తరబడి పెంచడం లేదని, నిబంధనలకు విరుద్ధంగా కార్మికులను ఇతర పనులకు వాడుకోవడం వల్ల మిగిలిన కార్మికులపై పని భారం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నందిగామ కమిటీ సభ్యులు కర్రీ వెంకటేశ్వరరావు, షేక్ హుస్సేన్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు గరికపాటి ప్రసాదు, పిచ్చయ్య, రుతమ్మ, బేబీ, సతీష్, భూషి, రమేష్, రాములు, కార్మికులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఇటీవల వరదల కారణంగా పశ్చిమ నియోజకవర్గం 38వ డివిజన్‌కు చెందిన 300 కుటుంబాలు వరదలకు గురైన నేపథ్యంలో వారికి జనసేన పార్టీ ఆధ్వర్యంలో సోమవారం పున్నమిలో నిత్యావసర సరుకులను జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను చేతుల మీదుగా అందజేశారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్ ఆధ్వర్యంలో దాత పెడన జనసేన నాయకులు దాసరి సత్యనారాయణ సహకారంతో ఒక్కో కుటుంబానికి రూ 1200 విలువ చేసే నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొప్పిరెడ్డి ఎన్.ఎన్. మూర్తి, బాడిత శంకర్, తమ్మిన లీలా కరుణాకర్, గన్ను శంకర్, సమ్మెట రాజా నాయుడు, గరికిపాటి శివశంకర్ పాల్గొన్నారు.



టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-వన్‌టౌన్: పశ్చిమంలో భారీ స్థాయిలో టిడిపి సభ్యత్వ నమోదుకు కృషిచేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న చెప్పారు. సోమవారం 53వ, 54వ, 55వ డివిజన్లలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా బుద్ధా వెంకన్న హాజరై ఈ మూడు డివిజన్లలో టిడిపి కార్యకర్తలకు, అభిమానులకు, సానుభూతి పరులకు పార్టీ సభ్యత్వ నమోదుపై అవగాహన కల్పించి పార్టీ బలోపేతానికి భారీగా సభ్యత్వ నమోదు చేయించారు. నూతన సభ్యత్వ విధానంలో రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకుంటే టిడిపి కార్యకర్తలకు అందించే సదుపాయాలను బుద్దా వెంకన్న వివరించారు. ఈ కార్యక్రమంలో 53వ డివిజన్‌కి చెందిన టిడిపి నాయకులు మధు, ఇమ్రాన్, 54వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు సలీమ్, తాజుద్దీన్, 55వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు జాహిద్, భవానీ ప్రసాద్, ఉమ్మడి చంటి, మరుపిళ్ల తిరుమలేష్, నమ్మి భానుప్రకాష్, పట్నాల హరిబాబు తదితరులు పాల్గొన్నారు. స్థానిక 43వ డివిజన్‌లో టిడిపి డివిజన్ అధ్యక్షులు కొనికి కొండయ్య ఆధ్వర్యంలో తెలుగుదేశం సభ్యత్వాల నమోదు కార్యక్రమం చురుకుగా సాగుతోంది. సోమవారం ఏకలవ్యనగర్‌లో పలువురు టిడిపి సభ్యత్వాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పూజల శ్రీనివాసరావు, తంజావూరి ప్రసాదు, బాలసాని కోటేశ్వరావు, బొజ్జగాని నాగరాజు, చెంచయ్య పాల్గొన్నారు.



నానో టెక్నాలజీలో పట్టు సాధించాలి

ప్రొఫెసర్ మూర్తి యాదవ్

ప్రజాశక్తి-వన్‌టౌన్: రసాయనశాస్త్ర విద్యార్థులు నానో టెక్నాలజీపై మరింత పట్టు సాధించాలని మిట్ వరల్డ్ పీస్ యూనివర్శిటీ (పుణే) డిపార్ట్‌మెంట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ డవలప్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ మూర్తి యాదవ్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల పీజీ రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'నానో మెటిరియల్స్ అండ్ అప్లికేషన్స్' అంశంపై సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన ప్రొఫెసర్ మూర్తి ఎస్ఎస్ఎస్ చావాలి యాదవ్ మాట్లాడుతూ నానో టెక్నాలజీ వినియోగం రసాయనశాస్త్రంలో విస్తతమైందన్నారు. నూతన అంశాల ఆవిష్కరణతో పాటుగా పలు సమీకరణాలకు నానో టెక్నాలజీని వినియోగిస్తున్నారని వివరించారు. నానో పదార్థాలను వైద్యం, విద్యుత్ పరికరాల తయారీలో, పర్యావరణ పరిరక్షణకు వినియోగిస్తున్నారన్నారు. వైద్యరంగంలో సూక్ష్మజీవుల సంహారకాలుగా, మందులను శరీరంలో ప్రవేశపెటేట కారకాలుగా వినియోగిస్తున్నారని వివరించారు. విద్యుత్ రంగంలో పాక్షిక విద్యుత్ వాహకాలుగా బయో సెన్సార్లను ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. నూతన ఆవిష్కరణలకు నానో టెక్నాలజీ చాలా కీలకమైనదిగా చెప్పారు. విద్యార్థులు ఈ రంగంలో ఉన్న నూతన ఆవిష్కరణలను అధ్యయనం చేసి తద్వారా మరిన్ని నూతన అంశాలకు శ్రీకారం చుట్టాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జీ కష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులు తమతమ రంగాలకు సంబంధించి జరిగే కార్యక్రమాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఓ శైలజ, డాక్టర్ కే కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



వైష్ణవికి నివాళి

ప్రజాశక్తి-వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గంకు చెందిన టిడిపి నాయకులు వి.వి.కె.నరసింహారావు కుమార్తె వైష్ణవి (26) ఆకస్మికంగా మృతిచెందారు. ఆమె గత కొంత కాలంగా అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మరణించారు. రెండు నెలల క్రితమే వైష్ణవికి వివాహమైంది. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావు, టిడిపి నాయకులు డూండీ రాకేష్, మాజీ కార్పొరేటర్ నూకల నాగేశ్వరరావు, టిడిపి నాయకులు కొణిజేటి రమేష్, విజయవాడ ఛాంబర్ అధ్యక్షులు గడ్డం రవి, ఆర్యవైశ్య సంఘ నాయకులు గడ్డం సత్యనారాయణ, కుసుమంచి గణేష్, ప్రవీణ్, ప్రదీప్, గోపి, సతీష్ తదితరులు వైష్ణవి భౌతికకాయాన్ని సందర్శించి నివాళు లర్పించారు.



పనులు వేగంగా పూర్తి చేయండి : సుజనా

ప్రజాశక్తి-వన్‌టౌన్ : విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, స్ట్రామ్ వాటర్ డ్రైన్లు, ఇండోర్ స్టేడియాల అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ (సుజన చౌదరి) అధికారులను ఆదేశించారు. పశ్చిమ నియోజకవర్గంలో జరుగుతున్న అభివద్ధి, సంక్షేమ పథకాల పురోగతిపై అన్ని శాఖల అధికారులతో తాడిగడపలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సుజనా చౌదరి సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ విద్యాధరపురంలో రూ. 6 కోట్లతో నూతనంగా నిర్మించనున్న ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను, మీసాల రాజారావు బ్రిడ్జి వద్ద నుండి బిఆర్‌టిఎస్ రోడ్డు వైండింగ్ పనులను వేగవంతం చేయాలన్నారు. అమత్ పథకం ద్వారా మంజూరైన రూ.74 కోట్లతో తాగునీటి సరఫరాలో జాప్యం లేకుండా త్వరితగతిన టెండర్ల ప్రక్రియను ప్రారంభించి పశ్చిమలో తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. అలాగే కౌన్సిల్లో ఆమోదం పొందిన 41 డివిజన్‌లో రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. చిట్టినగర్ సొరంగం వద్దనున్న నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించే ప్రయత్నం, కొండ ప్రాంతాల్లో ఉన్న ప్రజానీకం వారి నిత్యావసరాలను తేలికగా సరఫరా చేయడం కోసం లిఫ్ట్‌ల ఏర్పాటు కోసం అంచనాను రూపొందించాలన్నారు. నియోజకవర్గంలోని అధికారులకు వచ్చిన ఏ ఫిర్యాదునైనా స్వీకరించి సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సుజనా అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో చీఫ్ ఇంజనీర్ శ్రీనాథ్‌రెడ్డి, ఎస్ఇ సత్యనారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ సత్య కుమారి, ఈయి వెంకటేశ్వర రెడ్డి, జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


వియంసి అధికారులతో మాట్లాడుతున్న సుజనాచౌదరి

గ్యార్మీ వేడుకలు

ప్రజాశక్తి-వన్‌టౌన్

స్థానిక 41వ డివిజన్ భవానీపురంలోని గాలిబ్ షరీఫ్ దర్గాలో గ్యార్మి జెండా పండుగ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలిబ్ షరీఫ్ దర్గా గ్యార్మీ వేడుకల్లో పాల్గొనటం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి ముస్లీం సోదర, సోదరీమణులకు మంచి జరగాలని తాను కోరుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం ముస్లిం సోదరులకు విందును వడ్డించారు. ఈ కార్యక్రమంలో 41వ డివిజన్ కార్పొరేటర్ ఎం.డి.ఇర్ఫాన్, అబ్దుల్ రెహ్మాన్, ఇషాక్, షేక్ అక్బర్, ఎం.డి.రఫీబ్, షేక్ బాజీ, ఖాజా, షేక్ అభిద్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

విధుల్లో కొనసాగించాలని వినతిపత్రం

ప్రజాశక్తి-ఉంగుటూరు : మండలంలోని తేలప్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అక్రమంగా తొలగించిన మధ్యాహ్నభోజన పథకం నిర్వాహకురాలు సాలి చంటిని విధులలో కొనసాగించాలని కోరుతూ సిఐటియు మండల కార్యదర్శి కడవకొల్లు రామరాజు సోమవారం బాధితు రాలతో కలిసి మండల విద్యాశాఖాధికారి జె సాంబ శివరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ సెప్టెంబర్ 9 వ తేదీ బాదితు రాలు చంటిని అధికారపార్టీ నాయకులు నిబందనలు పాటించకుండా అన్యాయంగా తొలగించారన్నారు. దీనిని సవాలు చేస్తూ రాష్ట్ర హైకోర్టును ఆమె ఆశ్రయించగా నిభందనలు కూడా పాటించకుండా తొలగించడం అన్యాయం అని తక్షణమే విధుల్లోకి తీసుకుని కొనసాగించాలని ఉత్తర్వులను వెలువరించారు. కోర్టు అందజేసిన ఉత్తర్వుల కాపీని విద్యాశాఖాధికారికి అందజేశారు.

సమగ్ర పోషక యాజమాన్యంపై అవగాహన

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాలలోని ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కషి విజ్ఞాన కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రతినిధులకు సమగ్ర పోషక యాజమాన్యంపై సర్టిఫికెట్ కోర్సు ఆరవ రోజులో భాగంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, లాం, గుంటూరు మరియు వ్యవసాయ పరిశోధనా స్థానం, అమరావతి ని సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా భూసార పరీక్షా విధానం, ఆవశ్యకత, మరియు భూసార పరీక్షా ఫలిత ఆధారిత ఎరువుల యాజమాన్యం, సమస్యాత్మక భూముల యాజమాన్యం తదితర అంశాలను మతిక విభాగ శాస్త్రవేత్త డా. సుజనీ రావు వివరించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ పరిశోధ నా సంచాలకులు, డా. దుర్గా ప్రసాద్ విజ్ఞాన యాత్రకు విచ్చేసిన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అమరావతి పరిశోధనా స్థానం నందు జీవన ఎరువుల రకాలు, వాటి తయారీ విధానం, వినియోగం, మరియు వాటి ఉపయోగాలు తదితర అంశాలను గురించి డా. రవీంద్ర రెడ్డి క్షుణ్ణంగా వివరించారు. ఈ యాత్రలో పాల్గొనడం ద్వారా అభ్యర్థులు మంచి విజ్ఞానాన్ని పెంపొందించుకున్నారని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయ కర్త డా. డి. సుధా రాణి, ఈ కోర్సు ఇంచార్జి డా. కె. రేవతి, సస్య రక్షణ శాస్త్రవేత్త తెలిపారు.

సజావుగా ధాన్యం సేకరణ చేపట్టాలి : డిఎస్‌ఓ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో ఖరీఫ్ సీజన్ 2024కు సంబంధించి ధాన్యం సేకరణ సజావుగా సాగేందుకు కృషి చేయాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిణి వి. పార్వతి, జిల్లా పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ సజన రెవిన్యూ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సోమవారం నగరంలోని స్థానిక జిల్లా పరిషత్ సమావేశపు మందిరంలో వారు డిప్యూటీ తహసిల్దార్లు, వీఆర్వోలకు జిల్లాలో ధాన్యం సేకరణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ క్రమంలో వారు ధాన్యం సేకరణ ప్రక్రియలో ప్యాడీ ప్రొక్యూర్మెంట్ మొబైల్ యాప్ ఉపయోగించే తీరును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా డీఎస్ఓ మాట్లాడుతూ ధాన్యం సేకరణలో కస్టోడియన్ అధికారులుగా వీఆర్వోలు, వాహన కదలిక పర్యవేక్షణ అధికారిగా (వెహికల్ మూవ్మెంట్ మానిటరింగ్ ఆఫీసర్) డిప్యూటీ తహసిల్దార్లు వ్యవహరిస్తారని అన్నారు. వీరు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రెండు షిఫ్టుల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ధాన్యం ఎంత సేకరించారు, ధాన్యం రకం, తేమ శాతం, వాహనంలో ధాన్యం లోడింగ్ అన్లోడింగ్ సమయాలు, మిల్లు పేరు తదితర వివరాలు నమోదు చేసేందుకు తప్పనిసరిగా రిజిస్టర్ ను నిర్వహించాలని సూచించారు. ధాన్యం సాధారణ రకం ఒక క్వింటాలకు రూ.2,300, ఏ గ్రేడ్ ధాన్యం రకం ఒక క్వింటాలకు రూ.2,320 ప్రభుత్వం మద్దతు ధర కల్పించిందన్నారు. ఈ సమావేశంలో సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ డి.సజన, మండల వ్యవసాయ అధికారులు, డిప్యూటీ తహసిల్దార్లు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిణి వి. పార్వతి

ఖోఖో పోటీల్లో కృష్ణాజిల్లా జట్టుకు ద్వితీయస్థానం



ద్వితీయస్థానం సాధించిన కృష్ణాజిల్లా జట్టు క్రీడాకారులు

ప్రజాశక్తి - గుడివాడ : ఈ నెల 25న జరిగిన 43వ ఆంధ్రప్రదేశ్ జూనియర్స్ రాష్ట్రస్థాయి బాలుర ఖో-ఖో పోటీలలో కృష్ణాజిల్లా బాలురు జట్టు ద్వితీయస్థానంలో నిలిచినట్లు ఖో-ఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మడక ప్రసాద్, మద్దినేని సత్యప్రసాద్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 25న చిత్తూరు జిల్లా కాణిపాకం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్స్ ఖో-ఖో పోటీలలో కృష్ణాజిల్లా బాలుర జట్టు ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. ఈ పోటీలలో బహుమతులు సాధించిన జట్టుకు ఖో-ఖో సంఘం చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, ఉపవిద్యాశాఖ అధికారిణి ఐ.పద్మారాణి, కష్ణాజిల్లా కామన్ బోర్డ్ సెక్రటరీ షేక్ జాన్‌సాహెబ్, ఎస్.పి.ఎస్. పాఠశాల హెచ్ఎం టి.ఎం.ఈ.రాణి, పాఠశాల సిబ్బంది అభినందలను తెలిపారు.

నైపుణ్య గణనకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి-విజయవాడ : రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా త్వరలో జిల్లాలో నైపుణ్య గణన (స్కిల్ సెన్సస్) ప్రక్రియ సజావుగా జరిగేందుకు పూర్తిస్థాయిలో సిద్ధంకావాలని జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ డా. నిధి మీనా ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి కలెక్టర్ నిధి మీనా.. ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు తదితరులతో ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. నవంబర్ 3వ తేదీ నుంచి ప్రారంభంకానున్న నైపుణ్య గణన సర్వే ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని.. సిబ్బందిని సమాయత్తం చేయాలని సూచించారు. మంగళవారం ఒక్కో మండలం నుంచి ఇద్దరు చొప్పున సచివాలయ సిబ్బందికి మాస్టర్ ట్రైనర్లుగా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ల ద్వారా క్షేత్రస్థాయిలో సిబ్బందికి పూర్తిస్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. సర్వేలో ప్రధానంగా విద్యార్హతలు, సామాజిక-ఆర్థిక స్థితిగతులు, ప్రస్తుత ఉపాధి వివరాలు, నైపుణ్యాలు, ఆకాంక్షలు తదితర 25 రకాల ప్రశ్నల ద్వారా సమాచారం సేకరించాల్సి ఉంటుందన్నారు. ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీకి సంబంధించి అక్టోబర్ 31 సెలవుదినం కావడంతో 30వ తేదీనే బ్యాంకుల నుంచి నగదు విత్‌డ్రా చేసి.. నవంబర్ 1, 2 తేదీల్లో పెన్షన్ పంపిణీని పూర్తిచేయాలని సూచించారు. 2,33,248 మంది పెన్షన్‌దారులకు రూ. 99.45 కోట్ల మేర పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు.

సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



అవనిగడ్డలో...

ప్రజాశక్తి - నందివాడ (గుడివాడ) : రాష్ట్ర అభివద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా భావిస్తూ సిఎం చంద్రబాబు ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే ముందుకు సాగుతోందని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం నందివాడ మండలంలో నిర్వహించిన పల్లె పండగ కార్యక్రమం నిర్వహించి, మండలంలోని అరిపిరాల, రామాపురం, వెంకట రాఘవపురం, వెన్ననపూడి గ్రామాల్లో రూ.38 లక్షల నిధులతో గ్రామాల్లో నిర్మించనున్న సిసి రోడ్లకు మాజీ ఎమ్మెల్యే రావి భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో మండల టిడిపి అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, తమ్మలపల్లి, రామపురం సర్పంచ్‌లు రాధాకష్ణ, కాకరాల సురేష్, నాయకులు చేకూరు జగన్‌మోహ న్‌రావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం :** గ్రామాల అభివద్ధే టీడీపీ లక్ష్యమని ఆ పార్టీ నాయకులు జొన్నలగడ్డ సుధాకర్ అన్నారు. మండలంలోని తెంపల్లిలో రూ.35 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ సంక్షేమ, అభివద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డీఈ శ్రీనివాసరావు ఏఈ దాసు తదితరులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డ ఆరో వార్డులో ఉపాధి హామీ పథకం నిధులు రూ 11.40తో సిసి రోడ్డు నిర్మాణానికి నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ అభివద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఈఈ పగడాల సురేష్ బాబు, జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు, టిడిపి సీనియర్ నాయకులు పరుచూరి దుర్గాప్రసాద్, మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ, ఆసుపత్రి కమిటీ సభ్యురాలు బచ్చు కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు



ఎల్ఐసి ఏజెంట్ల నిరసన

ప్రజాశక్తి-గన్నవరం : లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పిలుపుమేరకు సోమవారం గన్నవరంలోని ఎల్ఐసి కార్యాలయం ఎదుట ఏజెంట్లు నిరసన కార్యక్రమం నిర్వహించారు. పాలసీలపై బోనస్ పెంచాలని, జీఎస్టీ తొలగించాలని, ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్లు పాల్గొన్నారు.

అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల పరిశీలన

ప్రజాశక్తి-మోపిదేవి : అధిక వర్షాలు బారినపడి రైతుల పొలాలు నీటిముంపు వల్ల నష్టపోతున్న పరిస్థితుల్లో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచన మేరకు ఇరిగేషన్ శాఖ సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ అధికారులు సోమవారం మోపిదేవి మండలంలో పర్యటించారు. మోపిదేవి మండల పరిధిలో ఉన్న అవుట్‌ఫాల్ స్లూయిజులను పరిశీలించారు. మోపిదేవి మండలం ఉత్తర చిరువోలులంక, పెదకళ్ళేపల్లి పరిధిలో ఉత్తర చిరువోలులంక -1,-2, అయోధ్య, మంగలివానిసింకు అవుట్ ఫాల్ స్లూయిజులు పరిశీలించారు. అవుట్‌ఫాల్ స్లూయిజుల ప్రస్తుత పనితీరు, సామర్థ్యం పరిశీలించారు. అవుట్‌ఫాల్ స్లూయిజు కట్టడాల పటిష్టత, షటర్ల పనితీరు పరిశీలించారు. ఔట్ ఫాల్ స్లూయిజులు పునర్ నిర్మాణాలు చేయాల్సిన ఆవశ్యకతపై ఉన్నత అధికారులకు నివేదిక సమర్పిస్తామని అధికారుల బందం ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ ఈఈ ఎం.ఎస్.వి వేణుగోపాలరావు, డీఈఈ ఎం.నాగలక్ష్మి, ఏఈ కే.నిహారిక, ఇరిగేషన్ డీఈఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా అడ్డగింత

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి తహసీల్దార్ డి. వనజాక్షి ఆశాల ఆదేశాల మేరకు నదీ పరివాహ ప్రాంతమైన చల్లపల్లి మండలం ఆముదార్లంక కృష్ణానది నుండి అక్రమంగా జరుగుతున్న ఇసుక రవాణాను సోమవారం రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న 30 ట్రాక్టర్ల డ్రైవర్లను అదుపులోకి తీసుకు న్నారు. అయితే ట్రాక్టర్ డ్రైవర్లు తాము మంత్రి తాలూకా మను షులం... తాము స్టేషన్కు రాము అంటూ రెవెన్యూ అధికారులపై దురుసుగా ప్రవర్తించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 30 ట్రాక్టర్లను రెవిన్యూ సిబ్బంది పోలేరు వంతెన వద్దకు తీసుకురాగా డ్రైవర్లు తాము అంటూ మొరాయిం చడంతో సిబ్బంది కూడా అక్కడే బైటాయించారు. ఇంత జరిగిన పైఅధికారులు సంఘటన స్థలానికి రాకపోవడంపై పలువురు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాల వలన రహదారులు ఛిద్రం అవుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారులు కంగి నాశనం కావడంతో బయటకు వెళ్లేందుకు కూడా వీలుపడటం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

'దిక్సూచి' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-నందిగామ: పదో తరగతి విద్యార్థులకు ఉద్దేశించిన 'దిక్సూచి' పుస్తకాన్ని నందిగామలో సోమవారం ఉపాధ్యాయులు ఆవిష్కరణ చేశారు. నందిగామ కేంద్రంగా జరిగిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుల ఒకరోజు ఎస్ఎస్సి పబ్లిక్ పరీక్షల పేపర్‌పై ఓరియెంటేషన్ తరగతుల్లో కోర్స్ ఇంచార్జి బి.రాంబాబు నాయక్, జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం పొదిలి విజయలక్ష్మి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ మన్నేపల్లి కృష్ణయ్య, తిరునగరి రంగాచార్యులు, వట్టికొండ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు పరిహారం అందించాలి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: వరద బాధితులకు పరిహారం అందించి న్యాయం చేయాలని సిపిఎం ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి యం మహేష్, వైయస్సార్ కాంగ్రెస్ 26వ వార్డ్ కౌన్సిలర్ గుంజ శ్రీనివాస్ వరద బాధితులతో కలిసి విజయవాడలో సబ్ కలెక్టర్ చైతన్యకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొండపల్లి శ్రామిక నగర్ (కొత్త గేటు), అంబేద్కర్ నగర్, ఇబ్రహీంపట్నం దుర్గా కాలనీ, ఆంజనేయ నగర్, ఖాజీమాన్యం, గాజులపేట, భీమరాజు గుట్ట, ప్రసాద్ నగర్ బాధితులు అధికారుల నిర్లక్ష్యం వల్ల వరద బాధితులకు పరిహారం అందక నానా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దీనిపై అధికారులకు ఎన్ని విజ్ఞప్తులు చేసినా ఏం చేయలేని స్థితిలో ఉన్నారన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో రీసర్వే చేయాలని విజ్ఞప్తి చేశారు.



ఆర్థిక సాయం

ప్రజాశక్తి-తిరువూరు: ఇటీవల మృతిచెందిన స్నేహితుడు కుటుంబానికి చిన్న నాటి స్నేహితులు సోమవారం ఆర్థిక సహాయం చేశారు. తిరువూరు రాజుపేట ప్రాంతానికి చెందిన పెరుమాళ్ల శివ ప్రసాద్ నెలక్రితం గుండె పోటుతో మృతిచెందాడు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. కుటుంబం ఆర్థిక ఇబ్బందులు చూసిన శివ ప్రసాద్ స్నేహితులు రూ.40 వేలు, మరో శ్రేయోభిలాషి రూ.60 వేలు మొత్తం కలిపి రూ.లక్ష నగదును కుమార్తె దీక్షిత పేరుమీద సప్తగిరి గ్రామీణ బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఈ కార్యక్రమంలో కాలసాని నాగేశ్వరరావు, రాజ్ మహమ్మ ద్, బాబు, పెరుమాళ్ళ నిరంజన్, మోదుగు వెంకటేశ్వర రావు, తోట సామ్, తోట శ్రీను, కాటంరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

ప్రజాశక్తి-మైలవరం: **ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివద్ధి** సంస్థ, డాక్టర్ లక్కిరెడ్డి హనీమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మైలవరం జెకెసి, జిల్లా ఉపాధి కల్పన శాఖ డిఆర్డిఏ సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 30వ తేదీన మైలవరంలోని డా. లక్కిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కాలేజ్ ప్రిన్సిపాల్ ఇళ్ల రవి, జిల్లా ఉపాధి కల్పన అధికారి డి విక్టర్‌బాబు, జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి శ్రీనివాస్ రావు, జెకెసి కోఆర్డినేటర్ విజయదీప్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 18 నుండి 35 సంవత్సరాల వయసు లోపు వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు https://naipunyam.ap.gov.in/user-registration నందు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 82476718 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జాహ్నవి ఎంపిక

ప్రజాశక్తి-తిరువూరు: ఉమ్మడి కృష్ణాజిల్లా 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన జగ్గయ్యపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అథ్లెటిక్స్ పోటీల్లో పాఠశాలకు చెందిన కె.జాహ్నవి పాల్గొని హైజంప్ అండర్-17 విభాగంలో అత్యంత ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించటంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు పిఎస్ఎన్ రాజు తెలిపారు. పి.దీపిక అండర్-14 విభాగంలో హైజంప్‌లో తతీయ స్థానం, ఎం.మయూరి డిస్కస్ త్రోలో తృతీయ స్థానం సాధించారని చెప్పారు. శ్రీకాకుళం జిల్లాలో త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలలో జాహ్నవి అత్యంత ప్రతిభతో మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈన ందర్భంగా పాఠశాలలో సోమవారం జాహ్నవిని ప్రధానోపాధ్యాయుడితో పాటు వ్యాయామ ఉపాధ్యాయురాలు సుకన్య అభినందించారు.



అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ సైక్లింగ్

ఓవరాల్ ఛాంప్ కృష్ణాజిల్లా

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: విజయవాడ రూరల్ మండలం నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎన్‌టీఆర్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన 68వ స్కూల్ గేమ్స్ అంతర్ జిల్లాల సైక్లింగ్ (ట్రాక్) విభాగంలో ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టు ఓవరాల్ చాంపాయిన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. అండర్ - 14, 17, 19 కేటగిరిల బాలుర, బాలికల విభాగాలలో కృష్ణాజిల్లా సైక్లిస్టులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి చాంపియన్‌షిప్‌ను దక్కించుకున్నారు. గుంటూరు జిల్లా రెండోస్థానంలో, విజయనగరం జిల్లా మూడో స్థానంలో నిలిచాయి. స్థానిక నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోనే ట్రాక్ విభాగం పోటీలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన పోటీలలో పలు జిల్లాలకు చెందిన సైక్లిస్టులు పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో నున్న జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వజ్రాల భూపాల్‌రెడ్డి ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన కష్ణా జిల్లా జట్టుకు ట్రోఫీని అందజేశారు.



అలాగే కష్ణాజిల్లా సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి కె సుగుణరావు, రాష్ట్ర క్రీడాప్రాధికారసంస్థ (శాప్) సైక్లింగ్ కోచ్, టోర్నమెంట్ పరిశీలకుడు వీ కనకారావు, నున్న హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు నరెడ్ల సత్యనారాయణరెడ్డి, గుంటక శివశేషిరెడ్డి తదితరులు వ్యక్తిగత విభాగాలలో విజేతలకు పతకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సైక్లింగ్ టోర్నమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శులు టి విజయ వర్మ, టి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి

ఎల్‌విపిఇఐ నేత్ర వైద్యులు సుశాంక్

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ: దీపావళి సందర్భంగా టపాసులు, ఇతర మందుగుండు సామాగ్రి కాల్చేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎల్విపిఇఐ కన్సల్టెంట్ ఆప్థల్మాలజిస్ట్ డాక్టర్ డాక్టర్ సుశాంక్ బలేరావు సూచించారు. ఈ మేరకు విజయవాడ డాక్టర్ కోడె వెంకటాద్రి చౌదరి ప్రాంగణంలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ (ఎల్విపిఇఐ)లో సోమవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడుతూ కంటికి గాయమయితే చేయవలసినవి, చేయకూడనివి వివరించారు. టపాసులు కాల్చేటప్పుడు కంటికి గాయం అయితే వెంటనే వైద్య సహాయం పొందాలన్నారు.



కంటిని మృదువుగా కడగాలని, కంటికి రక్షణ కల్పించాలని, కన్ను నలపకూడదని అన్నారు. గృహ వైద్యాలు ఉపయోగించకూడదన్నారు. కంటి లోపలి తునకలను తొలగించవద్దన్నారు. గాయానికి నూనె ఇతర క్రీములు పూయకూడదన్నారు. టపాకాయలు వెలిగించే సమయంలో కేవలం మందంగా ఉన్న నూలు దుస్తులు ధరించాలని, అన్ని దుస్తులనూ బిగుతుగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో విజయవాడ ఎల్విపిఇఐ హెల్ప్‌లైన్ నంబర్ 0866-6712009, 7095152576లకు సంప్రదించాల్సిందిగా కోరారు.



ఇసుక ర్యాంపుల పరిశీలన

ప్రజాశక్తి-కంచికచర్ల

నందిగామ ఎసిపి రవికిరణ్, నందిగామ టౌన్ సిఐ వైవిఎల్ నాయుడు, రూరల్ సిఐ చవాన్ ఆధ్వర్యంలో కంచల ఇసుక స్టాక్ పాయింట్, పెండ్యాల ఇసుక ర్యాంప్ ను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా ఎవరైనా ఇసుక పాలసీకి విరుద్ధంగా అక్రమ రవాణా చేసినా, అక్రమంగా ఇసుక నిల్వ ఉంచినా, రాత్రిపూట ఇసుక రవాణా చేసినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలీస్ సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-విజయవాడ: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్‌లో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలకు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమాలను నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ప్రారంభించారు. అను గ్రూప్ అఫ్ హాస్పిటల్స్ ద్వారా ఉచిత వైద్య శిబిరం, న్యూ సిటీ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. చ్చేసి ప్రారంభిండచం జరిగింది. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉచిత వైద్య శిబిరంలో నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో పోలీసు సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. బిపి, బ్లడ్ షుగర్, ఈసిజి, డెంటల్, నేత్ర వైద్య పరీక్షలు, వాటికి సంబంధించిన సలహాలు, సూచనలతో పాటు తీసుకోవలసిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది



అవగహన కల్పించారన్నారు. ఎఆర్, సివిల్, ట్రాఫిక్ సిబ్బంది రక్తదానంలో పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపిలు గౌతమి షాలి, తిరుమలేశ్వరరెడ్డి, కృష్ణమూర్తినాయుడు, ఉదయరాణి, ప్రసాద్, అను హాస్పిటల్స్ డైరెక్టర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు ఆస్తులు కాపాడాలని వినతి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే నూతన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుతో వక్ఫ్ బోర్డు ఆస్తులకు మరింత నష్టం జరిగే అవకాశం ఉన్నందున తక్షణమే ఆలోచన విరమించుకోవాలని ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు అల్తాఫ్ రజా కోరారు. సోమవారం తాడేపల్లి కార్యాలయంలో మైనారిటీ వ్యవహారాల శాఖ కమిషనర్ చిట్టూరి శ్రీధర్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శాలువాతో ఆయనను ఘనంగా సన్మానించారు. వక్ఫ్ బోర్డు ఆస్తులు ఇప్పటికే ఎన్నో అన్యా క్రాంతమై ఆక్రమణల చేతుల్లో ఉన్నాయని, దానివల్ల ముస్లిం సమాజానికి జరిగే మేలు జరగకుండా నష్టపోతున్నారని అన్నారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుతో ఆస్తులకు మరింత నష్టం జరిగే అవకాశం ఉందని దీనిపై ప్రభుత్వ పెద్దలకు సమగ్ర నివేదిక ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ తమ పరిధి మేరకు ముస్లిం ప్రయోజనాలకు పూర్తి కషి చేస్తానని, సవరణ బిల్లుపై వినతులను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు.



క్లాప్ ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ప్రజాశక్తి-విజయవాడ: మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నగర కమిటీ ఆధ్వర్యంలో క్లాప్ ఆటో కార్మికుల సమస్యలపై సోమవారం ఉపకార్మిక కమిషనర్ కార్యాలయంలో డిప్యూటీ లేబర్ కమిషనర్ ఆషారాణితో చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు దోనెపూడి కాశీనాథ్ మాట్లాడుతూ స్వయంభు యాజమాన్యం క్లాప్ ఆటో కార్మికుల సమస్యలపై కక్షపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. అబద్ధాలు ప్రచారం చేస్తుందన్నారు. క్లాప్ ఆటో కార్మికులకు నెలకు రూ.18,500 జీతం ఇస్తామని చెప్పి మోసం చేశారని, కనీసం ఐడి కార్డులు, ప్లే సిప్పులు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారని, స్వయంభు ఇచ్చిన లెటర్ తప్పులు తడకగా ఉందని అన్నారు. కార్మికులకు వారాంతపు సెలవులు ఇవ్వాలన్నారు. కార్మికులకు న్యాయం జరిగేంత వరకు సిఐటియు అండగా ఉంటుందన్నారు. దీనిపై ఆషారాణి స్పందిస్తూ ఒకటో తేదీన కార్పొరేషన్ అధికారులు, స్వయంభు యాజమాన్యం, యూనియన్ నాయకులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తానని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు జ్యోతిబస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.ప్రవీణ్, షాప్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి వై.సుబ్బారావు, క్లాప్ ఆటో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కె.శివ, డి.కిరణ్, రాజేష్, దుర్గాప్రసాద్, రాజు, రాము, మార్క్, రుద్ర, రామరాజు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.